
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



గుంటూరు జిల్లా వార్తలు

5

మంగళవారం 23 సెప్టెంబరు 2025

ఆన్‌లైన్ అమ్మకం..బాదుడు

- ఈ కామర్స్ సైట్లలో భారీగా అక్రమాలు
- ప్లాట్‌ఫామ్, ఆఫర్, హ్యాండ్లింగ్ ఫీజుల పేరుతో భారీగా వడ్డన
- నో రీఫండ్.. రిటర్న్ ఆప్షన్ తొలగిస్తున్న వైనం..
- తప్పుడు ప్రొడక్టు వచ్చినా స్పందించని తీరు

థర్డ్ పార్టీలతో ప్రమాదం..

ఈ-కామర్స్ సంస్థలు నమ్మకస్తులైన అమ్మకందారులనే వినియోగదారుల ముందుకు తీసుకురావాలి. కానీ, ఇటీవల థర్డ్ పార్టీ అమ్మకందారులను కూడా తీసుకువస్తున్నాయి. వారు ఇచ్చే ఆఫర్లను బ్యానర్లుగా కూడా ప్రమోట్ చేస్తున్నాయి. ఈ కారణంగా ఎక్కువ మంది వాటి ఉచ్చులో పడుతున్నారు. తీరా వారు ఆర్డర్ చేసుకున్న ప్రొడక్టు పాతది లేక.. రీ ఫర్బిష్డ్ రావడమో జరుగుతోంది. ఈ విషయం తెలియక చాలామంది వాటిని కొత్త వస్తువులుగా భావించి మోసపోతున్నారు. ఒకవేళ వాటిని గుర్తించినా.. రిటర్న్ చేయడానికి అవకాశం కూడా ఉండడం లేదు.



పండగల వేళ..పెరిగిన ఆన్‌లైన్ కొనుగోళ్లు..

(గుంటూరు, ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రముఖ పండుగలు దసరా, దీపావళి సందర్భంగా భారీ స్థాయిలో కొనుగోళ్లు జరుగుతుంటాయి. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఈ రెండు పండగల సందర్భంలో రూ.200 కోట్ల మేర వ్యాపారం జరుగుతుందని అంచనా. అం దులో సుమారు రూ.150 కోట్లు ఆన్ లైన్ వ్యాపారమే ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు. ఏడాది పాటు జరిగే వ్యాపారంతో సమానంగా ఈ రెండు పండగల సమయంలోనే జరుగుతుందంటే.. ఎంత భారీ స్థాయిలో వినియోగదారులు కొనుగోలు చేస్తుంటారో ఇట్టే అంచనా వేయవచ్చు. నగటున ప్రతి వంద మంది కొనుగోలు దారుల్లో

(మిగతా 8వ పేజీలో)

ఈ-కామర్స్ సంస్థలు వచ్చిన తర్వాత జనం షాపులకు వెళ్లి వస్తువులు కొనడమే దాదాపుగా మానేశారు. స్మార్ట్ ఫోన్ చేతిలోకి తీసుకోవడం, నచ్చిన ప్లాట్‌ఫాంను ఎంచుకోవడం.. కావాల్సినవి ఆర్డర్ పెట్టుకోవడం.. వారం రోజుల్లో అవి మన గడప దగ్గరకు వచ్చి చేరడం జరిగిపోతోంది. ఈ సులభతర పద్ధతుల కారణంగా మధ్యతరగతి ప్రజలు ఆన్‌లైన్ కొనుగోలు వైపు మొగ్గు చూపుతున్నారు. దీనికి తోడు అన్ని బ్యాంకులు క్రెడిట్, డెబిట్ కార్డుల పేరుతో భారీ డిస్కౌంట్లు ఇస్తుండడంతో.. స్థానిక మార్కెట్లను పూర్తిగా మర్చిపోయారు. ఇదే ఈ-కామర్స్ సంస్థలకు వరమైంది. ఈ పరిస్థితిని అడ్డం పెట్టుకుని ఇష్టం వచ్చిన కాడికి వినియోగదారులపై బాదుడు మొదలు పెట్టాయి. రకరకాల ఫీజుల పేరుతో జేబులు ఖాళీ చేస్తున్నాయి. రానున్న దసరా, దీపావళి పండగల సందర్భంగా వచ్చే డిస్కౌంట్ ఆఫర్లతో అప్రమత్తంగా లేకపోతే నష్టపోవడం ఖాయం!



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న జ్వర బాధితులు

కలరా, డయేరియా ప్రబలకుండా పకడ్బందీ చర్యలు

- వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండ్యన్ ఆదేశాలు

గుంటూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యన్ అధికారులను ఆదేశించారు. తాగునీరు, పారిశుద్యం పర్యవేక్షణతో పాటు అనారోగ్యకరమైన ఆహారం అమ్మకాలు జరగకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. జిల్లాలో డయేరియా, కలరా వంటి వ్యాధులు విజృంభిస్తుండటంతో కమిషనర్ వీరపాండ్యన్ సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయేరియా, కలరా వంటి సీజనల్ వ్యాధులు వ్యాప్తికి గల కారణాలు తెలుసుకోవాలన్నారు. ఇందులో భాగంగా కమ్యూనిటీ డిసీజ్ నిపుణులతో.. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ బృందాలు కేసులు నమోదవుతున్న సమయం, ప్రాంతం, వ్యాధి బారిన పడుతున్న వారి వయస్సు, క్లినికల్ అంశాలపై క్షేత్రస్థాయిలో విశ్లేషణ చేయాలన్నారు. దీని వల్ల నివారణ చర్యలు మరింత పటిష్ఠంగా చేపట్టడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. ఆర్‌ఎంపీల వద్ద కాకుండా.. ప్రభుత్వ ఆసుపత్రిల్లోనే చికిత్స తీసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని చెప్పారు. పైపులైను ద్వారా నీటి సరఫరాలో ఇబ్బంది ఉంటే వెంటనే.. నిలిపివేసి ట్యాంకర్ల ద్వారా క్లోరినేషన్ చేసిన నీటిని సరఫరా చేయాలని సూచించారు. వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లలో నీటిని తనిఖీ చేసి.. నిర్దేశిత ప్రమాణాలు లేని వాటిని మూసి వేయించాలని ఆదేశించారు. వైద్యారోగ్య శాఖ అధికారులు అనారోగ్య లక్షణాలతో బాధపడుతున్న వారి వివరాలను మున్సిపల్ అధికారులకు అందించాలన్నారు. జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ సీజనల్ వ్యాధుల జాగ్రత్తలపై లఘు వీడియోలను చిత్రీకరించి సోషల్ మీడియా ద్వారా విస్తృత స్థాయిలో ప్రచారం కల్పించాలన్నారు.

కలెక్టర్ అన్సారియా డయేరియా కేసుల వివరాలను కమిషనర్‌కు వివరించారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో సెప్టెంబర్ 17 నుంచి ఇప్పటి వరకు 146 మంది డయేరియా లక్షణాలతో ఆసుపత్రిలో చేరారని తెలిపారు. ప్రస్తుతం 84 మంది చికిత్స పొందుతున్నారని మిగతావారు డిశ్చార్జ్ అయ్యారని పేర్కొన్నారు. డయేరియా కేసులు నమోదు అవుతున్న ప్రాంతాల్లో తాగు నీటిని పూర్తి స్థాయిలో పరీక్షించి, పారిశుధ్య కార్యక్రమాలు మరింత మెరుగుపడేలా నగరపాల సంస్థ అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కమ్యూనిటీ డిసీజ్ వైద్య నిపుణుడు డాక్టర్ శివ గోపాల్, మునిసిపల్ ఈఎన్‌సీ ప్రభాకర్‌రావు, అదనపు కమిషనర్ ఓబులేసు, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయలక్ష్మి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, ఫుడ్ సేఫ్టీ అధికారి పూర్ణచంద్రరావు, డీఈఓ రేణుక, శిశు సంక్షేమ శాఖ అధికారి ప్రసూన తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

పకడ్బందీగా ఓటరు జాబితా

- రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ అన్సారియా

గుంటూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఓటరు జాబితాలను పకడ్బందీగా రూపొందిస్తామని, ఇందుకోసం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు సలహాలు, సూచనలు అందజేయాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సంఘం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితాలు రూపొందించే ఉద్దేశంతో స్పెషల్ ఇన్‌టెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) చేపట్టబోతున్నట్లు తెలిపారు. సోమవారం వివిధ రాజకీయ పార్టీ నాయకుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని బూత్ స్థాయి అధికారులందరూ 2002 నుంచి 2025 వరకు ఓటరు జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి అందిన ఫిర్యాదులను ఈ నెల 30 నాటికి పరిష్కరించాలని ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు స్పందిస్తూ.. ఆధార్‌కు ఓటరు కార్డు అనుసంధానం చేస్తే చాలా సమస్యలు పరిష్కారం అవుతాయని సూచించారు. ఈ విషయమై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. కుటుంబ సభ్యులందరి ఓట్లు ఒకే పోలింగ్ బూత్‌లో ఉండాలని, గతంలో నమోదైన ఫాం-7 కేసులపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. రానున్న ఎన్నికల్లో వెయ్యి మందికి ఒక పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలన్నారు. వలస కార్మికుల ఆధార్ కార్డు ఎక్కడ ఉందో.. అక్కడే వారు ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. బీ ఎల్‌వోలు డోర్ టు డోర్ సర్వే చేయడం లేదని, వాళ్లు ఓటరు జాబితాలను క్షుణ్ణంగా పరిశీలన చేసేలా చూడాలన్నారు. ఓటింగ్ రోజు మాత్రమే కాకుండా ముందు రోజు కూడా సెలవు ప్రకటించాలని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలి. ఈఆర్వోలు, విపత్తుల నిర్వహణ శాఖ జిల్లా ప్రాజెక్టు మేనేజరు లక్ష్మీకుమారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, ఆర్డీవో శ్రీనివాసరావు, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ మల్లేశ్వరి పాల్గొన్నారు.

జీఎంసీ డీసీ శ్రీనివాసరావు బదిలీ

ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏసీగా నియామకం

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 22: గుంటూరు నగరపాలక సంస్థ డీసీ డి.శ్రీనివాసరావు ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులను ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ సోమవారం జారీ చేశారు. అలాగే శానిటరీ సూపర్‌వైజర్ జాస్తి రామారావును ఉయ్యూరు మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు.

తెనాలి మున్సిపల్ కమిషనర్‌గా జేఆర్ అప్పలనాయుడు



తెనాలి, సెప్టెంబర్ 22, (ఆంధ్రజ్యోతి): తెనాలి మున్సిపల్ కమిషర్‌గా శ్రీకాకుళం జిల్లా రాజాం మున్సిపాలిటీ కమిషనర్ జె. రామ అప్పలనాయుడు బదిలీ అయ్యారు. సోమవారం రాష్ట్రంలోని ఐదు మున్సిపాలిటీలకు కొత్త కమిషనర్లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. గత కమిషనర్ శేషన్న బదిలీపై వెళ్లాక ఎఫ్‌ఏసీ పద్ధతిలోనే అసిస్టెంట్ కమిషనర్, ఎంఈలకు కమిషనర్ బాధ్యతలు అప్పగిస్తూ వచ్చారు. ప్రస్తుతం మున్సిపల్ ఇంజనీర్ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

రెచ్చిపోతున్న రేషన్ మాఫియా!

- పొన్నూరు పొరుగు మండలాల్లో వ్యాపారుల తిష్ట..
- అక్కడి నుంచే నిత్యం పేదల బియ్యం సేకరణ

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): చీకటి మాటున రేషన్ బియ్యం మాఫియా రాజ్యమేలుతోంది. ఓ వైపు పాలకులు హెచ్చరికలు.. మరో వైపు పోలీసుల ఆంక్షలు ఉన్నప్పటికీ అక్రమార్కులు కాసుల వేటలో రేషన్ దందాను కొనసాగిస్తున్నారు. పొన్నూరు నియోజకవర్గం వైసీపీ ప్రభుత్వ హయాంలో రేషన్ మాఫియా నిలయంగా ఉండేది. ఆధిపత్య పోరులో వ్యాపారి హత్య సైతం జరిగింది. వ్యాపారులు మధ్య పోటీ పెరగడం.. దందా కాసుల వర్షం కురిపించడంతో అక్రమార్కులు చెలరేగిపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ బహిరంగ వేదికలపై పలుమార్లు రేషన్ మాఫియాను అరికడతానని.. కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరికలు చేశారు. పోలీసులూ బియ్యం వ్యాపారుల పట్ల కఠినంగా వ్యవహరించారు. రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ సమయంలో కూడా ఎమ్మెల్యే రేషన్ డీలర్లను హెచ్చరించారు. లబ్ధిదారుల వద్ద బియ్యం సేకరించినా.. నల్ల బజారుకు తరలించినా డీలర్‌షిప్ రద్దుచేసి.. క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తానని హెచ్చరించారు. ఎమ్మెల్యే కఠిన చర్యలతో.. పొన్నూరులో తిష్ట వేసిన బియ్యం వ్యాపారులు పొరుగు ప్రాంతాలకు దందాను మార్చుకున్నారు. అక్కడి నుంచి యథేచ్ఛగా తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు.

పొరుగున మకాం..

రేషన్ మాఫియా పొన్నూరు ప్రాంతంలోని కొందరు యువకులను, కూలీలను, వ్యాపారులను నగదు ఆశ చూపి.. దందాకు అనుకూలంగా మార్చుకుంది. టీవీఎస్‌లు, ముగ్గు బండ్లు, చిన్న ఆటోల ద్వారా గ్రామాల్లో తిరుగుతూ.. రేషన్ బియ్యం సేకరిస్తున్నారు. ఇక్కడి



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం ఆటో

నుంచి ప్రతిరోజూ పొరుగు మండలాలకు తరలించి.. రహస్య ప్రాంతాల్లో డంపు చేస్తున్నట్లు సమాచారం. పొన్నూరుకు కూతవేటు దూరంలో ఉన్న చుండూరు, అమర్తలూరు, చెరుకుపల్లి, బాపట్ల, కర్లపాలెం మండలాలతో పాటు జిల్లాలోని ప్రత్తిపాడు, గుంటూరు రూరల్ మండలాలకు బియ్యం తరలించి కాసుల వేట కొనసాగిస్తున్నారు.

సునాయాస ఆదాయం..

డీలర్ల వద్ద మకాం వేసి కొందరు యువకులు లబ్ధిదారులు రేషన్ బియ్యం తీసుకున్న వెంటనే.. వారికి కేజీకి రూ. 15 ఇచ్చి కొంటున్నారు. పక్క ప్రాంతాలకు తరలించి రూ.20 నుంచి రూ.25 వరకు విక్రయిస్తున్నారు. పొన్నూరు మండలంలోని తాళ్లపాలెం, మామిళ్ళపల్లి.. పట్టణంలోని నిడుబ్రోలు తుకారం మిల్లు ప్రాంతాలకు చెందిన వ్యక్తులు ఈ రేషన్ బియ్యం మాఫియాలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం ఎన్ని హెచ్చరికలు చేసినా.. సునాయాసంగా ఆదాయం వచ్చే రేషన్ అక్రమ రవాణా దందాను వ్యాపారులు వదులుకోలేకపోతున్నారు. ఇటీవల చుండూరు, చేబ్రోలు ప్రాంతాల్లో కొందరు రేషన్ వ్యాపారులను బెదిరించడంతో.. ఎదురు తిరిగి దాడులు చేసే వరకు పరిస్థితి వెళ్లింది.



శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రీ బాలత్రిపుర సుందరీదేవి అలంకరణలో అమ్మవారు

నగరంలో దసరా శోభ

- అమ్మవార్లకు బాల త్రిపుర సుందరీదేవిగా అలంకరణ

గుంటూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా నగరంలో దసరా శోభ సంతరించుకుంది. రంగురంగుల విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా ఆలయాలను ముస్తాబు చేశారు. ఆలయాల ఎదుట వివిధ రకాల పుష్పాలు, అరటి బోదెలతో సుందరంగా అలంకరించారు. ఏటుకూరు రోడ్డులోని కన్యకా పరమేశ్వరి ఆలయం, పొన్నూరు రోడ్డు సంగడిగుంట వద్ద కనక దుర్గమ్మ దేవస్థానం, చుట్టుగుంట పోలేరమ్మ దేవస్థానంలో అమ్మవార్లకు తొలి రోజు శ్రీ బాల త్రిపుర సుందరీదేవిగా అలంకరణ గావించారు. భక్తులు అమ్మవార్ల దివ్య తేజస్సును దర్శించి, తరించిపోయారు. లాలాపేట గంటలమ్మ చెట్టువీధిలో ఉన్న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు గజలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ చైర్మన్లు, ఈఓలు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కొత్త పింఛన్లు ఇంకెప్పుడో!

నోటిఫికేషన్ కోసం ఎదురు చూపులు

- గత టీడీపీ హయాంలో నిరంతరాయంగా ప్రక్రియ
- వైసీపీ రాకతో ఆ విధానానికి స్వస్తి
- కూటమి ప్రభుత్వం రాకతో లబ్ధిదారుల్లో ఆశలు
- కార్యాలయాలకు వెల్లువలా దరఖాస్తులు, వినతులు
- కొండంత ఆశతో ఎదురుచూస్తున్న ఆశావహులు
- నోటిఫికేషన్ కోసం ఎదురు చూపులు

గుంటూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొత్తగా పింఛన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం కోసం కొండంత ఆశతో లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం లేక పింఛనుకు దూరమైన అనేక మంది కూటమి ప్రభుత్వం రాకతో తమకు అవకాశం వస్తుందన్న ఆశతో 15 నెలలుగా ఎదురు చూస్తున్నారు. నిరంతరాయంగా పింఛను దరఖాస్తులు, వినతులు వెల్లువలా ప్రభుత్వ, ప్రజాప్రతినిధుల కార్యాలయాలను ముంచెత్తుతున్నాయి.


నాడు అలా.. ఇప్పుడు ఇలా..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ల నమోదు ప్రక్రియ నిరంతరాయంగా జరిగేది. లబ్ధిదారులు వారంలో ఏ రోజైన పింఛను కోసం దరఖాస్తు చేసుకునే వీలుండేది. వాటిని ఏ వారానికి ఆ వారం పరిశీలించి నెలాఖరుకు జాబితాను సిద్ధం చేసేవారు. ఫలితంగా అర్హులైన లబ్ధిదారులకు ఆ మరుసటి నెల నుంచే పింఛను పొందే అవకాశం కలిగేది. గత వైసీపీ ప్రభుత్వం ఈ విధానానికి స్వస్తి చెప్పింది. ఆరు నెలలకు ఒకసారి మాత్రమే లబ్ధిదారుల జాబితా రూపొందించే విధానాన్ని తెర మీదకి తెచ్చింది. ఏటా జూన్, డిసెంబరు నెలల్లోనే జాబితా రూపొందిస్తామని చెప్పింది. గడిచిన ఐదేళ్లలో ఒక్కసారి కూడా ఆరు నెలలకు జాబితా రూపొందించిన దాఖలాలు లేవు. కాగా కూటమి ప్రభుత్వం వచ్చాక పాత పద్ధతిలో ప్రతి నెలా పింఛను దరఖాస్తుల ప్రక్రియ ఉంటుందని అందరూ భావించారు. కానీ, ఆ ఊసే లేదు.

బాధితులకు న్యాయమెప్పుడు..?

గతంలో టీడీపీ ప్రభుత్వం కొత్త పింఛన్ల నమోదును నిరంతర ప్రక్రియగా చేస్తే.. వైసీపీ ప్రభుత్వం పింఛనుదారులను ఘోరంగా వంచిస్తూ నిబంధనల పేరుతో వడపోత మొదలు పెట్టింది. విద్యుత్ వినియోగం 300 యూనిట్లు దాటిందని, ఇన్‌కమ్ టాక్స్ రిటర్న్స్ చెల్లించారని, ఇంట్లో ప్రభుత్వ ఉద్యోగి ఉన్నారని, నాలుగు చక్రాల వాహనం ఉందని, పరిమితికి మించి ఇళ్ల స్థలాలు, పొలాలు ఉన్నాయన్న నెపంతో వేలాది మందిని పింఛను పథకానికి అనర్హులను చేసి తొలగించింది. ఇలా ఒకసారి తొలగిస్తే వారికి మళ్లీ అవకాశం రావడానికి ఆరు నెలలు పడుతుంది. అలా కోల్పోయిన పింఛన్లు వైసీపీ హయాంలో తిరిగి వచ్చిన దాఖలాలు లేవు.

కూటమి ప్రభుత్వం వచ్చీ రావడంతోనే పింఛనును రూ. 3 నుంచి 4 వేలకు పెంచింది. దానికి తోడు బీసీ, ఎస్సీ, ఎస్టీ పింఛనుదారుల వయోపరిమితిని 50 ఏళ్లకు తగ్గిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి ఉన్నారు. దీంతో వారంతా కొత్త నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో సుమారు 50 వేల మంది వరకూ అర్హులైన వృద్ధులు, వితంతు, ఒంటరి మహిళలు కొత్తగా పింఛను కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఎదురు చూస్తున్నారు.





8లో..

విజ్ఞాన 'అమరావతి'!

- రాజధానిలో ప్రపంచ ఖ్యాతి సెంట్రల్ లైబ్రరీ
- రూ.150 కోట్ల వ్యయంతో అద్భుతంగా..
- జ్ఞాన కేంద్రంగా...టెక్నాలజీ హబ్‌గా..
- అత్యాధునిక వసతులతో రెండేళ్లలో పూర్తి..
- అసెంబ్లీలో మంత్రి లోకేశ్ ప్రకటన

బాధ్యతలు చేపట్టిన భార్గవ తేజ



సీఆర్‌డీఏ అదనపు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన భార్గవ తేజ

తుళ్లూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీఆర్‌డీఏ అదనపు కమిషనర్‌గా అమిలినేని భార్గవ తేజ సోమవారం బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు కమిషనర్ కన్నబాబు, అదనపు కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్‌ను మర్యాదపూర్వకంగా భార్గవ తేజ కలిశారు. సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి భార్గవ తేజకు అభినందనలు తెలిపారు. ఇప్పటి దాక సీఆర్‌డీఏ అదనపు కమిషనర్‌గా పనిచేసిన మల్లవరపు నవీన్ ఐఏఎస్‌ల బదిలీల్లో భాగంగా కృష్ణాజిల్లా జాయింటు కలెక్టర్‌గా వెళ్లారు. గుంటూరు జిల్లా జాయింటు కలెక్టర్‌గా పనిచేసిన భార్గవ తేజను సీఆర్‌డీఏ అదనపు కమిషనర్‌గా నియమితులయ్యారు.

డీఎస్సీ అభ్యర్థులు రేపు గుంటూరులో రిపోర్ట్ చేయాలి: డీఈవో

గుంటూరు విద్య సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో మెగా డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులు గుంటూరు నగరంలోని పొన్నూరు రోడ్‌లో ఉన్న ఆంధ్ర ముస్లిం కళాశాలలో బుధవారం ఉదయం 11 గంటలకు రిపోర్టు చేయాలని డీఈవో సీవీ రేణుక తెలిపారు. అక్కడకు వస్తే ఈ నెల 25న జరిగే నియామక పత్రాల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యేందుకు అభ్యర్థులతో పాటు వారి కుటుంబసభ్యులలో ఒకరికి గుర్తింపు కార్డులు జారీ చేస్తామని వెల్లడించారు. 25వ తేదీ ఉదయం ఏడు గంటలకల్లా అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులు విద్యాశాఖ జారీ చేసిన గుర్తింపు కార్డులతో ఆంధ్ర ముస్లిం కళాశాలకు రావాలని సూచించారు. వారిని ప్రత్యేక బస్సుల్లో సచివాలయం సమీపంలో జరిగే నియామక పత్రాల పంపిణీ కార్యక్రమానికి తీసుకెళ్తామని డీఈవో తెలిపారు.

ట్విట్టర్‌లో సమస్య పై స్పందించిన మంత్రి నారా లోకేశ్

సత్తెనపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రఘు రామ్ నగర్ ఎక్స్‌టెన్షన్‌లో రోడ్ల దుస్థితి వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తమ సమస్యను తీర్చాలని ఆ ప్రాంతానికి చెందిన నందా సాంబశివరావు ట్విట్టర్‌లో రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌కు విన్నవించారు. దీనిపై స్పందించిన నారా లోకేశ్.. సత్తెనపల్లి నుంచి నరసరావుపేట రోడ్డు మార్గ నిర్మాణం త్వరలో జరగనుందని, రఘు రామ్ నగర్ ప్రాంతంలోని ఎక్స్‌టెన్షన్ ఏరియాలో ఉన్న రోడ్లను కూడా మరమ్మత్తులు చేస్తామని ట్విట్టర్‌లో తెలియజేశారు. స్థానిక ఎమ్మెల్యే, సంబంధిత మంత్రితో కూడా సమస్యపై మాట్లాడినట్టు లోకేశ్ పేర్కొన్నారు.

అచ్చంపేట డాక్టర్ రాజేశ్ కుమార్ సస్పెన్షన్

అచ్చంపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన అచ్చంపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న డాక్టర్ రాజేశ్ కుమార్‌ను సస్పెండ్ చేస్తున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ పీ రవి సోమవారం తెలిపారు. ఆదివారం ఆస్పత్రిలో సకాలంలో వైద్యం అందక ఓ రోగి మృతి చెందినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో, ఆ సమయంలో విధుల్లో ఉండాల్సిన డాక్టర్ రాజేశ్ కుమార్ లేకపోవటంతో ఆయన్ను సస్పెండ్ చేసినట్టు డీఎంహెచ్‌వో తెలిపారు.

పశ్చిమడెల్టాకు 7,004 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకు సోమవారం 5,009 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద 12 అడుగుల నీటి మట్టం ఉండగా దిగువకు 3,75,125 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి హై లెవెల్ చానల్‌కు 200 క్యూసెక్కులు, రేపల్లె కాల్వకు 1,356 క్యూసెక్కులు, తూర్పుకాల్వకు 524 క్యూసెక్కులు, పశ్చిమకాల్వకు 225 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 399 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 2,480 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో సోమవారం జరిగిన వేలంలో 1,173 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు, క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.10,325, గరిష్ఠ ధర రూ.10,785, మోడల్ ధర రూ.10,650 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.10,325, గరిష్ఠ ధర రూ.10,650, మోడల్ ధర రూ.10,525 పలికాయి.

గురజాడ గృహాన్ని స్మృతి చిహ్నంగా అభివృద్ధి పరచాలి

● అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ



విలేకరులతో మాట్లాడుతున్న పెనుగొండ లక్ష్మీనారాయణ, పక్కన మాజీ మంత్రి వరప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, లక్ష్మణ రెడ్డి తదితరులు

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దీనావస్థలో ఉన్న మహాకవి గురజాడ అప్పారావు గృహాన్ని అభివృద్ధి పరిచి సాహి తీవేత్తలకు, సామాజిక మార్పు కోసం తపిస్తున్న ఔత్సాహికులకు స్మృ తి నిలయంగా తీర్చిదిద్దాలని అభ్యుదయ రచయితల సంఘం జాతీ య అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ కోరారు. సోమవారం గుం టూరులోని జనచైతన్య వేదిక హాలులో పెనుగొండ లక్ష్మీనారాయణ విలేకరులతో మాటాడారు. సాంస్కృతిక స్థాయి లోపించిన పాలక పక్షాలతో తెలుగు సాహిత్యానికి, సమాజానికి విఘాతం కలుగు తుందని అన్నారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక లాంటి రాష్ట్రాలు ప్రాచీన రచయితలను గుర్తు చేసుకుంటూ గౌరవిస్తున్న తరుణంలో ఆంధ్రప్రదేశ్‌లో గుర జాడ, కందుకూరి, గిడుగు, జాషువా లాంటి మహనీయులను విస్మ రించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశా రు. అనంతరం మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లా డుతూ, సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించకపోతే సమాజం పతనమవు తుందని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మ ణరావు మాట్లాడుతూ, గురజాడ జయంతిని ప్రతి ఏటా అధికారికంగా నిర్వహించాలని, ఆయన పేరుతో సాంస్కృతిక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లం రెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ నవంబరు 30న విజయనగరంలో గురజాడ వర్ధంతి రోజు సాహితీ ప్రియులతో, పౌర సంస్థల ప్రతినిధు లతో రాష్ట్ర సదస్సును నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇటీవల గురజాడ అప్పారావు గృహాన్ని అభివృ ద్ధి చేస్తామని, స్మారక చిహ్నాన్ని నిర్మిస్తామని ప్రకటించడం హర్షదా యకమన్నారు. రాజధాని అమరావతిలో నిర్మించ తలపె ట్టిన కేంద్ర గ్రంథాలయానికి గురజాడ పేరు పెట్టాలని కోరారు. ఈ సమావేశంలో ప్రముఖ విద్యావేత్తలు ప్రొఫెసర్ డీఏఆర్ సుబ్రహ్మ ణ్యం, కన్నా మాస్టర్, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్ కుమార్, సామాజిక విశ్లేషకుడు టి. ధనుంజయ రెడ్డి పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

117 మంది యువతీ, యువకులకు ఉద్యోగాలు

మంత్రి లోకేశ్‌కు అభ్యర్థుల ధన్యవాదాలు



ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేస్తున్న టీడీపీ నేతలు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు ఏపీ నైపుణ్యాభివృద్ధి సం స్థ ఆధ్వర్యంలో సోమవారం మంగళగిరిలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. స్థానిక వీటీజేఎం అండ్ ఐవీటీ ఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాకు నియోజకవర్గ వ్యా ప్తంగా నిరుద్యోగ యువతీ, యువకులు పెద్ద సంఖ్యలో హాజర య్యా రు. ప్రతిభ, అవగాహన, ఇంటర్వ్యూల ఆధారంగా 117 మందికి ఉద్యో గాలు లభించాయి. 12కు పైగా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ఆయా సంస్థల్లో రూ.15 వేల నుంచి రూ.40 వేల వరకు జీతం లభించే ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేశారు. ఎంపికైన అ భ్యర్థులకు స్థానిక టీడీపీ నాయకులు నియామక పత్రాలను అందజే శారు. ఈ సందర్భంగా ఏపీ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి మాట్లాడుతూ, మంత్రి లోకేశ్ ఆదేశాల మేరకు ప్రతి నెలా నియోజకవర్గ పరిధిలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా జాబ్ మే ళా నిర్వహిస్తామన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేం దుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. ఈ కార్య క్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కే.సంజీవ రావు, కళాశాల ప్రిన్సిపాల్ గొడవర్తి నాగేశ్వరరావు, టీడీపీ మంగళగిరి, దుగ్గిరాల మండల అధ్యక్షులు పల్లబోతుల శ్రీనివాసరావు, కేసంనేని శ్రీఅనిత, పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పడవల మహేశ్, షేక్ రియాజ్, నేతలు వాసా పద్మ, మల్లవరపు వెంకట్, షేక్ నజీర్ పాల్గొన్నారు.

ఏఎన్‌యూ దూరవిద్య ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశ పరీక్షల ఫలితాల విడుదల



దూర విద్య పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ గంగాధరరావు, రెక్టార్ శివరామ్ ప్రసాద్, దూరవిద్య డైరెక్టర్ వెంకటేశ్వర్లు

ఏఎన్‌యూ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విద్యాలయం (ఏఎన్‌యూ) దూరవిద్య కేంద్రం పరిధిలో 2025-26 విద్యా సంవత్సరానికి గానూ రెండేళ్ల ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు సం బంధించి ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షా ఫలితాలు సోమ వారం విడుదలయ్యాయి. ఈ ఫలితాలను వర్సిటీ ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధరరావు, వర్సిటీ ఇన్‌చార్జీ రెక్టార్ ఆచార్య శివరాం ప్రసాద్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దూరవిద్య కేంద్రం పరీక్షల కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ దిట్టకవి రామచంద్రన్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా 10 కేంద్రాలలో పరీక్షలు సజావుగా జరిగాయన్నారు. ఎంబీఏ పరీక్షకు 444 మంది హాజరు కాగా 435 మంది అర్హత సాధిం చారని, ఎంసీఏ పరీక్షకు 82 మంది హాజరు కాగా 80 మంది అర్హత సాధించారని తెలిపారు. పరీక్ష ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు, ఐటీ డైరెక్టర్ ప్రభాకర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కృష్ణవేణి, సూపరింటెండెంట్ జవాజి శ్రీనివాస రావు, అధ్యాపకులు డాక్టర్ భరత్, డాక్టర్ ఎన్ బాబు, ఉద్యోగులు రాధాకృష్ణ, డాక్టర్ ఎంవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

మన పండగలు... మన చేనేతలు

● ఈ నినాదాన్ని ప్రతీ ఒక్కనాయకుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలి
● పండగలు, శుభకార్యాలకు చేనేత చీరలనే కొనుగోలు చేద్దాం
● 'ఎక్స్'లో డాక్టర్ పెమ్మసాని శ్రీరత్న పోస్టు వైరల్



గుంటూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మన పండ గలు... మన చేనేతలు అన్న నినాదాన్ని ప్రతీ ఒక్క సెల బ్రిటీ, నాయకుడు ప్రజల్లోకి తీసుకెళ్లగలిగితే చేనేత పరిశ్రమ కచ్చితంగా నిలదొక్కుకొంటుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సతీమణి డా క్టర్ పెమ్మసాని శ్రీరత్న పిలుపునిచ్చారు. దసరా నవరాత్రులు ప్రారం భం కావడంతో మహిళలు ఎక్కువగా చీరలు కొనుగోలు చేయనున్న దృష్ట్యా ఆమె సామాజిక మాధ్యమైన 'ఎక్స్' వేదికగా తన అంతరం గాన్ని పోస్టు చేశారు. డాక్టర్ శ్రీరత్న మాట్లాడుతూ గత ఏడాది విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ స్థాపించిన చేనేతశాలను తాను సందర్శిం చడం జరిగిందని, అక్కడ అనేక విషయాలు తెలుసుకొన్నానన్నారు. చేనేత కార్మికులంటే మగ్గం మీద నేసే వాళ్లు మాత్రమేనని మనకు తెలుసు. అయితే ఒక చీర కథ లూం(దారం)తో మొదలౌతుంది. దారం తయారీ చేయాలంటే తొలుత బ్లీచింగ్ నీళ్లలో నూలుని శుద్ధి చేస్తారు. ఆ తర్వాత రంగు పట్టించడానికి యాసిడ్ వాడుతూ వేడినీ ళ్లని పట్టిస్తారు. లూమ్ ఆరడానికి సరైన వాతావరణం ఉండాలి. వర్షం పడితే లూమ్ ఆరదు. ఇంత చేసినా కార్మికుడికి వచ్చేది రూ. 500 మాత్రమే. ఆ తర్వాత లూం నుంచి చరక మీదకు తీసుకెళ్లి సన్నగా దారాన్ని తయారు చేస్తారు. ఈ ప్రక్రియలన్నీ పూర్తి అయ్యాక మగ్గం మీదకు వెళుతుంది. డిమాండ్ లేకపోతే వస్త్రం తయారు కాదు. దీంతో నిలకడైన ఆదాయం లేక చేనేత రంగాన్ని చాలామంది వదిలేస్తున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. మనకు 9 రకాలైన చేనేతలున్నాయి. కలంకారి, మంగళగిరి, చీరాల, వెంకటగిరి, పొందూరు, ఉప్పాడ, పోచంపల్లి, గద్వాల్, ధర్మవరం చీరలను ఆదరించి కార్మికులను ప్రోత్సహించాలన్నారు. టెక్నాలజీ ఎంత పెరుగుతున్నా వృత్తి విద్యల ను ఆదరించాలన్నారు. అప్పుడే ఉన్న పరిశ్రమని బతికించుకోగలు గు తామని చెప్పారు. సీఎం సతీ మణి నారా భువనేశ్వరి పిలుపుమే రకు తాను దసరా పండగకు అమ్మవా రికి 9 రకాల చేనేతల చీరలు పెడుతున్నానన్నారు. అలానే దసరా, దీపావళి, కార్తీకమాసం, క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి, శివరాత్రి, ఉగాది, శ్రీరామనవమి ఇలా అనేక పండగలున్నాయి. అలానే శుభకార్యాలు జరుగుతుం టాయి. ప్రతీసారి చేనేత చీరని కొనుగోలు చేస్తే ఆ రంగం కార్మికులకు ఎంతో ప్రోత్సాహంగా ఉంటుందన్నారు. అలానే డిజైనర్లు వచ్చి మంచి డిజైన్లతో చీరాలు తయారు చేయడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ నవరాత్రి మన సంస్కృతిని గుర్తు చేసే సందర్భం కావాలి. చేనేత కార్మికుల శ్రమను తెలుగుదనంతో నింపాలి. మనం చేసే ప్రతీ చేనేత కొనుగోలుతో ఒక్కో కుటుంబంలో ఉత్సాహాన్ని నింపుదామని డాక్టర్ శ్రీరత్న పిలుపునిచ్చారు.

పోక్సో కేసులో పది సంవత్సరాల జైలు శిక్ష

నాదెండ్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం గ్రామంలో రాజీవ్‌గాంధీ కాలనీకి చెందిన మందా రఘు శివ ప్రసాదు అనే వ్యక్తికి పోక్సో కేసులో పది సంవత్సరాలు జైలు శిక్ష, రూ 2వేల జరిమానా పడింది. ఈ మేరకు శివ ప్రసాదుకు శిక్షను విధిస్తూ న్యాయమూర్తి షమ్మి పర్వీన్ సుల్తాన బేగం సోమవారం తీర్పునిచ్చారు. 2022 మే 28న రాజీవగాంధీ కాలనీకి చెందిన ఒకరు ఇచ్చిన ఫిర్యాదు చేయగా డీఎస్పీ విజయ భాస్కర్ విచారణ జరిపారు. ఈ కేసులో శివ ప్రసాదు దోషిగా తేలటంతో ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి ఈ శిక్ష విధించినట్టు నాదెండ్ల ఎస్సై పుల్లారావు తెలిపారు.

భూసేకరణకు ప్రభుత్వం రూ.120 కోట్లు విడుదల చేయాలి

మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

పెదనందిపాడు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగింపునకు ప్రభుత్వం రూ.120 కోట్లు విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం గుంటూరు చానల్ పొడిగింపు కార్యాచరణపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేశ్‌బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ, ఉమ్మడి గుంటూరు జిల్లాల్లోని ప్రజల చిరకాల వాంఛ అయిన గుంటూరు చానల్, వరికపూడిశెల ప్రాజెక్టులను కూటమి ప్రభుత్వం నేరవేర్చాలని కోరారు. గుంటూరు చానల్ పొడిగింపుతో 50 గ్రామాలకు తాగునీరు, 50 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. అయితే భూసేకరణకు కోసం రూ.120 కోట్లు కేటాయించాల్సి ఉంటే, ప్రభుత్వం రూ. 30 కోట్లు మాత్రమే కేటాయించిందని పేర్కొన్నారు. 2013 భూసేకరణ చట్టప్రకారం రైతులకు నష్టపరిహారం చెల్లించాలని లక్ష్మణరావు డిమాండ్ చేశారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ, గుంటూరు చానల్ పొడిగింపుతో ఈ ప్రాంత రైతులు రెండు పంటలు పండించుకోవచ్చని అన్నారు. కాలువ పొడిగించేంత వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని చెప్పారు. చానల్ పొడిగింపు అంశంపై కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సానుకూలంగా ఉన్నారని మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ జిల్లా సహాయకార్యదర్శి కొత్త వెంకటశివరావు, నల్లమడ రైతు సంఘ నాయకులు నరిశెట్టి ఆచారి, పారిశ్రామికవేత్తలు దాసరి శేషగిరిరావు, ముద్దన రాఘవయ్య, మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ, రైతు సంఘ నాయకులు ముద్దన వెంకటేశ్వర్లు, జంపని రామారావు, నల్లమోతు రాజేంద్ర, పోపూరి సుధీర్, ఆశీర్వాదం, నూర్‌బాషా సుభానీ సాహెబ్, పి భువనేశ్వరి, మర్రి లక్ష్మీ, పి సలీం పాల్గొన్నారు.

దుగ్గిరాలలో భారీ చోరీ....

● రూ.2.43 లక్షల విలువైన బంగారు నగల అపహరణ

దుగ్గిరాల, సెప్టెంబరు 22: మండల కేంద్రం దుగ్గిరాలలోని బ్రాహ్మణ బజారులో భారీ చోరీ జరిగింది. గ్రామానికి చెందిన కొల్లిపర చంద్రశేఖర్ ఈ నెల 20న తిరుమల వెళ్లారు. ఆయన భార్య విజయవాడ సమీపంలో ఉన్న పెనమూలూరులోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి తలుపులు బద్దలుకొట్టి చోరీకి పాల్పడ్డారు. చంద్రశేఖర్ 22వ తేదీన ఇంటికి వచ్చేసరికి ఇంటి తలుపులు బద్దలు కొట్టి ఉండటాన్ని చూసి ఆందోళన చెందారు. ఇంటి లోపలికెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. అందులో ఉండాల్సిన రూ.2.43 లక్షల విలువైన 98 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దాంతో వెంటనే భార్య జ్యోతికి ఫోన్ చేసి ఇంటికి పిలిపించి ఇరువురు వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై వెంకటరవి సంఘటనా స్థలానికి చేరుకొని ప్రాథమిక విచారణ జరిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

శుభం మహేశ్వరి కోల్ట్‌స్టోరేజీలో తహసీల్దార్ తనిఖీలు



దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజి సిబ్బందిని ప్రశ్నిస్తున్న తహసీల్దార్ సునీత, యార్డు సెక్రటరీ సుబ్బారావు తదితరులు

దుగ్గిరాల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీజ్ చేసిన పసుపును గ్రేడింగ్ చేయిస్తున్నట్లు ఫిర్యాదు అందడంతో శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజీలో తహసీల్దార్ తనిఖీలు నిర్వహించారు. 2024 జనవరి 19న దుగ్గిరాలలోని శుభం మహేశ్వరీ కోల్డ్‌స్టోరేజీలో జరిగిన అగ్నిప్రమాదంలో రైతులు నిల్వపెట్టిన రూ. కోట్లు విలువ చేసే పసుపు పంట అగ్నికి ఆహుతైంది. అప్పట్లో మంత్రి నారా లోకేశ్, కేంద్రసహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో పంట బీమా చేసిన రైతులకు, వ్యాపారులకు వారి ఖాతాల్లో నగదును జమచేశారు. కాగా, ప్రమాదంలో పాక్షికంగా కాలిపోయిన 1,169 బస్తాల పసుపును అధికారులు సీజ్‌చేసి, కోల్డ్‌స్టోరేజీ ఆవరణలోనే భద్రపరిచారు. అయితే అధికారుల అనుమతి లేకుండా యాజమాన్యం పసుపు ఫ్యాక్టరీ కూలీలతో రెండ్రోజులుగా గ్రేడింగ్ చేయిస్తున్నట్లు రైతులు ఫిర్యాదు చేశారు. దీనిపై మంత్రి పెమ్మసాని ఆదేశాలతో అధికారులు రంగంలోకి దిగారు. సమస్య పరిష్కార దశలో ఉండగా సీజ్‌చేసిన పంటను గ్రేడింగ్ చేయడమేమిటని ప్రశ్నించారు. అనంతరం మొత్తం పసుపు బస్తాలను యథాతధంగా బస్తాలలో నింపి సీజ్ చేశారు. యార్డు సూపర్‌వైజర్ శేషుబాబు, వీఆర్‌వోలు, పలువురు బాధిత రైతులు, స్థానిక వ్యాపారులు పాల్గొన్నారు. పసుపు బస్తాలను విక్రయించి వచ్చే మొత్తాన్ని నష్టపోయిన రైతులకే పంచాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

25,802 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 28,258 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 25,802 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 7,161 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	12000
334	10500	14300	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13500	334	10500	14500
273	----	----	నెంబరు. 5	10000	13800
341	10000	15200	273	----	----
4884	----	----	341	10000	15300
సూపర్ 10	----	----	4884	10000	13500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15000	తేజ	10000	14800
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15200
బ్యాడిగి	10000	15000	దేవనూరు డీలక్స్	----	----
దేవనూరు డీలక్స్	10000	14000	తాలుకాయలు	5000	7200

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



జాబ్ మేళా పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న టీడీ జనార్దన్, మేయర్ నాని, సతీష్‌శర్మ తదితరులు

నిరుద్యోగ యువతకు మెగా జాబ్ మేళా సువర్ణావకాశం

● టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్

గుంటూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో డిసెంబరు 13న నిర్వహించనున్న మెగా జాబ్ మేళా నిరుద్యోగ యువతకు సువర్ణావకాశం లాంటిదని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్ అన్నారు. ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ ఆధ్వర్యంలో అమరావతి రోడ్డు హిందూ కాలేజీ ఆఫ్ ఫార్మసీ ఆవరణలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో మెగా జాబ్ మేళా పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఈ జాబ్ మేళాలో రిజిస్టర్ చేసుకుని డిసెంబర్ 13వ తేదీన నిర్వహించే మేళాలో పాల్గొని ఉద్యోగాలు పొందాలని కోరారు. సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ మాట్లాడుతూ నిరుద్యోగులకు అండగా నిలవాలనే ఉద్దేశ్యంతో జాబ్ మేళాకు శ్రీకారం చుట్టామని తెలిపారు. రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ మాట్లాడుతూ నవంబరు 22 తేదీ వరకు బ్రాహ్మణులు రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు మాట్లాడుతూ జాబ్ మేళాలో తమ కళాశాల విద్యార్థులు కూడా పాల్గొంటారన్నారు. నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ ఇంతటి మహత్తర కార్యక్రమం నిర్వహించటం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో అడ్వైజరీ కమిటీ చైర్మన్ సత్యవాడ దుర్గా ప్రసాద్, సమా ఖ్య ప్రధాన కార్యదర్శి హెచ్‌కె మనోహరరావు, పొన్నపల్లి సోమశేఖర్, రాజశేఖర్‌రావు, ఏలేశ్వరపు జగన్మోహన్‌రాజు, రఘురామయ్య, వి.పాండురంగ విఠల్, జాబ్ మేళా కన్వీనర్ రావులపాటి అయ్యప్పశర్మ, కో కన్వీనర్ మండా రవి, లలితా శాస్త్రి, మాచిరాజు మురళి, మాటేటి నాగరాజు తోలేటి రవీంద్ర, జాబ్ మేళా కమిటీ మెంబెర్ కొప్పర్తి సీతారమేష్ తదితరులున్నారు.

డయేరియా ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన క్లీనింగ్ చేపట్టాలి

● అధికారుల ఆదేశించిన కమిషనర్ పులి శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో డయేరియా అనుమానిత, నిర్ధారిత ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన డ్రెయిన్ల క్లీనింగ్ చేపట్టాలని విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిపై క్రమశిక్షణా చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తా మని కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఇంజనీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ మంగళవారం సాయంత్రానికి కేసులు నమో దైన ప్రాంతాలలో తాగునీటి పైపులైన వ్యవస్థ, డ్రెయిన్లలో పూడికతీత, చెత్త డంపింగ్ పాయింట్స్, భవన నిర్మాణ వ్యర్థాల పై మూడు విభాగాల అధికారులు సమగ్ర సర్వే చేసి నోడల్ ఆఫీసర్ ద్వారా నివేదిక ఇవ్వాలన్నారు. పైపులైన్ల లీకులను గుర్తించడం, మరమ్మతులు చేయడం, సర్టిఫైడ్ ఆర్వో ప్లాంట్ల నుంచి తాగునీటిని సరఫరా చేయడం, సంపులను కూడా శుభ్రం చేయడం వంటివి ఇంజనీరింగ్ అధికారులు చేపట్టాలన్నారు. అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సి.హెచ్ శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ ఇన్‌చార్జ్ సుందర రామిరెడ్డి, ఎంహెచ్.ఓ డాక్టర్ లక్ష్మీనారాయణ, మేనేజర్ బాలాజీ బాష, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఏఈలు అదనపు మోటార్లను కేటాయించుకోవాలి

నగరంలో వర్షాలకు నీరు నిలిచిన ప్రాంతాల్లో నీటిని బెయిల్ అవుట్ చేయడానికి ఏఈలు అదనపు మోటార్లను, సిబ్బందిని కేటాయించుకోవాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం కమిషనర్ తుఫాన్ నగర్, మారుతీ నగర్ ప్రాంతాల్లో పర్యటించి, వర్షం నీటిని బెయిల్ అవుట్ చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆర్టీఓ ఆఫీస్ దగ్గరలోని అన్న క్యాంటీన్‌ని పరిశీలించి, ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున తాగునీటి సరఫరా, పారిశుధ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అక్షయపాత్ర సిబ్బంది ఆదేశించారు.

అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కారం చేయాలి

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో స్థానిక సమస్యల పరిష్కారంపై ప్రజల నుంచి అందే అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కారం చేయాలని డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు ఆదేశించారు. కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్ లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో పీజీఆర్ఎస్‌ని వారు నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 23 ఫిర్యాదులు తీసుకొని, డయల్ యువర్ కమిషనర్‌కి అందిన అర్జీల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు తీసుకొని అధికారులతో మాట్లాడుతూ పీజీఆర్ఎస్, ఇతర వేదికల ద్వారా ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా 37 అర్జీలు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్, మేనేజర్ బాలాజీ, బాషా పాల్గొన్నారు.

జిల్లాలో మాతృ మరణాలపై మదింపు : డీఎంహెచ్‌వో

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రెండు నెలల్లో సంభవించిన మాతృ మరణాలపై సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి అధ్యక్షతన సబ్ డిస్ట్రిక్ లెవెల్ మాతృ మరణాల సమీక్ష కమిటీ సమావేశం జరిగింది. ఇందులో చేబ్రోలు, నిడమర్రు, మందపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో జులై, ఆగష్టు నెలలో జరిగిన మూడు మాతృ మరణాలపై కమిటీ సభ్యులు సమీక్ష జరిపారు. ఆయా మరణాలకు గల కారణాలను అధ్యయనం చేసి అందులో ఒక మరణం నివారించదగినదిగా, రెండు మరణాలు నివారించలేనివిగా నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో డీఐవో డాక్టర్ ఏ.శ్రావణ్ బాబు, డీసీహెచ్ఎస్ డాక్టర్ రంగారావు, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ రోహిణి రత్నశ్రీ, గైనకాలజిస్టులు డాక్టర్ అరుణ, డాక్టర్ రాధికా రాయుడు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి

ప్రతి పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగం ఏర్పాటు చేయాలి

గుంటూరు (విద్య), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ప్రతి పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర కార్యదర్శి ఆర్.నరసింహారావు సూచించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వార్షిక సమావేశం సోమవారం పాత బస్టాండ్ వద్ద ఉన్న ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. కార్యదర్శి నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థులలో సేవాభావం, క్రమశిక్షణ, దేశభక్తిని పెంపొందించే స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉపయోగపడుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 955 పీఎం శ్రీ పాఠశాలలకు రూ.50 వేల నిధులను విద్యార్థుల యూనిఫాం, శిక్షణ కోసం అందించినట్లు వెల్లడించారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎస్ఓ సీవీ శ్రీనివాసరావు, ఎంఈఓలు రాయ సుబ్బారావు, రమణయ్య, డీటీసీ టి.నరేష్, డీఓసీఎం, శ్రీహరి, డాక్టర్ ఘంటా కిరణ్, సెక్రటరీ కామాక్షి అనిల్, నాగేశ్వరరావు, డాక్టర్ రమేష్ పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

● ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 291 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ అశుతోష్ శ్రీ వాస్తవ తదితరులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కారంలో అధికారులు ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. కలక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 291 అర్జీలు వచ్చాయి. జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో కె.ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మీకుమారి, గంగరాజు, ఆర్డీవో కే.శ్రీనివాసరావు, సోషల్ వెల్ఫేర్ ఈడీ, ఎస్సీ కార్పొరేషన్ శ్రీనివాస్‌తో కలిసి ఆమె అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ అర్జీ తిరిగి రీ ఓపెన్ కాకుండా పరిష్కరించాలన్నారు. బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళితే సంబంధిత అధికారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తురకపాలెం మరణాలపై విచారణ జరగాలి

తురకపాలెం గ్రామంలో గత రెండు, మూడు నెలలుగా సంభవించిన అసాధారణ మరణాలపై విచారణ జరిపించి, కారకులపై చర్యలు తీసుకోవాలని మాల మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు డిమాండ్ చేశారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వడంతో, వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. తొలుత శంకరన్ సమావేశ మందిరం ఎదుట బాధితులతో కలిసి నిరసన తెలిసి అనంతరం జేసీకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక సభ్యులు బూసి వెంకటేశ్వరరావు, నల్లపు నీలాంబరం, డి.జాన్ పాల్, బి.స్టాలిన్ బాబు తదితరులున్నారు.

ఒప్పంద ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

విద్యుత్ సంస్థలో దీర్ఘకాలికంగా పని చేస్తున్న ఒప్పంద కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జేసీ కమిటీ సభ్యులు అర్జీ అందజేశారు. డీఏ బకాయిలు చెల్లించి, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, డైరెక్ట్ పేమెంట్‌తో పాటు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో జేఏసీ సభ్యులు, ఉద్యోగులు ఉన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి

రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని కోరుతూ రేవెల్యూషనిరి విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో అర్జీ అందజేశారు. అనంతరం ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘురామిరెడ్డి మాట్లాడుతూ దాదాపు 6,500 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో విష్ణువర్ధన్, చరణ్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ విద్యాలయాల్లో ఇంగ్లీష్ విద్యను అందించాలి

ప్రభుత్వ విద్యాలయాల్లో ఇంగ్లీష్‌లోనే బోధనలు జరగాలని ఇంగ్లీష్ మీడియం విద్యా పరిరక్షణ వేదిక సభ్యులు అర్జీ అందజేశారు. రాష్ట్రంలో ఇంగ్లీష్ మీడియం విద్యను సంపూర్ణంగా అభ్యసించలేక అవకాశాలు కోల్పోతున్నారన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో దాదినబోయిన ఏడుకొండలు, అలా గోపియాదవ్, నూర్, కలామ్ తదితరులు ఉన్నారు.

లేని మీటరుకు.....బిల్లు కట్టమని వేధిస్తున్నారు

విద్యుత్ మీటర్ లేనప్పటికి దానికి సంబంధించిన బిల్లును కట్టాలని విద్యుత్ అధికా రులు వేధిస్తున్నారని స్థానిక చుట్టుగుంట, 7వ లైనుకు చెందిన కురాకుల విజయలక్ష్మి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇరవై ఏళ్ల క్రితమే ఆ మీటర్ కనెక్షన్ తొలగించామని, ఆ కనెక్షన్ మరో వ్యక్తికి కేటాయించారని తెలిపారు. కలెక్టర్ స్పందించి విద్యుత్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈవీఎం గోడౌన్‌లలో భద్రత ప్రమాణాలు పాటించాలి

● సీఈవో వివేక్‌యాదవ్ ఆదేశాలు

గుంటూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు త్రైమాసికా తనిఖీలలో భాగంగా చీఫ్ ఎలక్టోరల్ అధికారి వివేక్‌యాదవ్ కలెక్టరేట్‌లోని ఈవీఎం గోడౌన్‌ని సందర్శించారు. సోమవారం ఆయన కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోడౌన్ తాళాలు తెరిపించి భద్రతా ప్రమాణాలను, సీసీ టీవీ పనితీరు, అగ్నిమాపక పరికరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఎన్‌షేక్ ఖాజావలి, గుంటూరు ఆర్డీఓ కే శ్రీనివాసరావు అడిషనల్ ఫైర్ ఆఫీసర్ కృష్ణారెడ్డి, ఆర్ అండ్ బీ సివిల్ డీఈఈ ఏ నాగేశ్వరరావు, ఆర్ అండ్ బీఎలక్ట్రికల్ ఏఈ శ్రీరామమూర్తి, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి బిల్లా సునీల్, టీడీపీ నుంచి కంచర్ల శివరామయ్య, నాయుడు ఓంకార్, వైవీ సుబ్బారావు(బీజేపీ), చిరతనగండ్ల వాసు(బీఎస్‌పీ), కృష్ణకాంత్ (సీపీఎం), డాక్టర్ టీ సేవాకుమార్(ఆప్), సీహెచ్ త్రినాధ్(జనసేన), గుంటూరు పశ్చిమ మండల తహశీల్దార్ వెంకటేశ్వరరావు, ఎలెక్షన్ సెక్షన్ పర్యవేక్షకురాలు మల్లేశ్వరి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ఈవీఎం గోడౌన్‌ని సందర్శిస్తున్న చీఫ్ ఎలక్టోరల్ అధికారి వివేక్ యాదవ్, పక్కన కలెక్టర్ అన్సారియా

నేడు ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా శ్రీవెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్‌లో మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచితంగా ఓపీ వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆసుపత్రి ఎండీ, ఆయుర్వేద పంచకర్మ వైద్యనిపుణులు కొండా వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్నర్ రింగ్‌రోడ్‌లోని భాష్యం రామసేతు పక్కన గల తమ వైద్యశాలలో మంగళవారం ఉదయం ఈ ఓపీ వైద్యసేవల శిబిరాన్ని భాష్యం విద్యా సంస్థల అధినేత భాష్యం రామకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభిస్తారని ఆయన వివరించారు. కీళ్ల నొప్పులు, డిస్క్ సమస్యలు, సయాటికా, పక్షవాతం, మోకాళ్ల అరుగుదల, ఆస్మా, ఎలర్జీలు, అధిక బరువు, చర్మవ్యాధులు, సోరియాసిస్, పైల్స్, వెన్నుపూస సంబంధిత వ్యాధులు, ఇతర దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు ఉచితంగా నాడీ పరీక్షలు చేసి మందులు అందజేస్తామని డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు తెలిపారు.



కేక్ కట్ చేస్తున్న కొమ్మాలపాటి శ్రీనివాసరావు, పాల్గొన్న కనపర్తి తదితరులు

ఘనంగా కేఎస్‌ఆర్ పుట్టినరోజు వేడుకలు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నేతాజీ మిత్ర మండలి చైర్మన్, ప్రముఖ వ్యాపారవేత్త కొమ్మాలపాటి శ్రీనివా సరావు(కేఎస్‌ఆర్) పుట్టినరోజు వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. స్థానిక విద్యానగర్‌లోని నివాసంలో ఆయన కేక్ కట్ చేశారు. వేడుకల్లో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వరరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షు డు ఏల్చూరి వేంకటేశ్వర్లు, యడ్లపల్లి అశోక్‌కుమార్, బలరామకృ ష్ణయ్య, వడ్లమూడి శివరామకృష్ణయ్య, షైనేని శివరాంప్రసాదు తదితరులు పాల్గొని కేఎస్‌ఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలి

గుంటూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు సోమవారం నగరంలో నిరసన ప్రదర్శన జరిగింది. జేఏసీ జిల్లా చైర్మన్ ఎం.వీరాంజ నేయులు మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై కూటమి ప్రభుత్వం సత్వరమే స్పందించాలని కోరారు. అనంతరం డీఆర్‌వో ఖాజావలికి వినతిపత్రం అందజేశారు. జేఏసీ నాయకులు షేక్ సుభాని, సుబ్బారావు, గుర్నాధరావు, రవిశంకర్, డి.నాగరాజు, గురుబ్రహ్మం, బంగారయ్య, సురేష్, రాజశేఖర్, ఎస్ గణపతి, రాజేంద్ర తదితరులున్నారు.

మీరు జీవితంలో సాధించాల్సింది ఎంతో ఉంది!

● నూతన విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఉద్బోధ

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యలోకి ప్రవేశించడం కెరీర్ ప్రారంభ దశ మాత్రమే అని, మరో ఇరవై ఏళ్ల అకుంఠిత దీక్షతో ఈ ప్రయాణం కొనసాగిస్తేనే జీవితంలో మంచి వైద్యుడిగా ఎదగగలరని గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్‌వీ సుందరాచారి ఉద్బోధించారు. సోమవారం జీఎంసీలో 2025-26 విద్యా సంవత్సరంలో కొత్తగా ఎంబీబీఎస్ కోర్సులో చేరిన విద్యార్థులకు తొలి రోజు నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.

ఐర్లాండ్‌లో ఎంబీఏ సీటు ఇప్పిస్తానని మోసం

గుంటూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తన కుమార్తెకు ఐర్లాండ్‌లో ఎంబీఏ సీటు ఇస్తానని తను నుంచి రూ.12.20 లక్షల డబ్బులు తీసుకొని ఓ కన్సల్టెన్సీ నిర్వాహకుడు మోసం చేశాడని బాపట్ల జిల్లా బల్లికురవ మండలం వల్లాపల్లి గ్రామానికి చెందిన అవిసెన కోటిరెడ్డి ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. బాధితుడు కోటిరెడ్డి ఫిర్యాదు మేరకు... నగరంలోని లక్ష్మీపురం మూడో లైన్‌కి చెందిన వరల్డ్ వైడ్ ఎడ్యుకేషన్ అండ్ కెరియర్ కన్సల్టెన్సీ నిర్వాహకుడు ఉడుముల వెంకటేశ్వర్‌రెడ్డి తన కుమార్తె సాత్వికరెడ్డికి ఐర్లాండ్ ఎంబీఏ సీటు ఇప్పిస్తానని గత ఏడాది జూన్ 24న తన నుంచి 12 లక్షల ఇరవై వేల రూపాయలు తీసుకున్నాడన్నారు. సీటు రిజర్వ్ చేసినట్లు కొన్ని నకిలీ పత్రాలు సృష్టించి తనకు అందించాడన్నారు. వెంకటేశ్వరరెడ్డిపై చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

కందులు కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా...

కందులు కొనుగోలు చేసి తనకు ఇవ్వాల్సిన మూడున్నర కోట్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నాడని ఇన్నర్ రింగ్ రోడ్డులోని లక్ష్మీ నరసింహనగర్ ఆరో లైన్‌కు చెందిన సకల వెంకటేశ్వరరావు సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు... అదిలాబాద్‌కు చెందిన సత్యనారాయణ దాల్ ఇండస్ట్రీస్ అధినేతలైన అర్జున్ కేడియా, ఆయన తండ్రి లలిత్ కేడియాలు గత ఏడాది తన నుంచి మూడున్నర కోట్ల ఖరీదైన 12 కంటైనర్ల కందులు కొనుగోలు చేశారన్నారు. అప్పటినుంచి ఆ డబ్బులు అడుగుతుంటే బెదిరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆస్తికోసం కుమారుడు కొడుతున్నాడు

ఆస్తికోసం కన్నకొడుకే తమను చంపడానికి ప్రయత్నిస్తున్నాడని ఆయన నుంచి తమకు ప్రాముఖ్యత కల్పించాలని గోరంట్ల కు చెందిన కూరాకుల వెంకటరావు, నాగమల్లేశ్వరి దంపతులు ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. పిడుగురాళ్ల పరిధిలోని పిల్లుట్ల గ్రామానికి చెందిన తాను ప్రస్తుతం గోరంట్లలో ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటున్నామన్నారు. తమకు ఇరువురు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం ఉన్నారన్నారు. కుమారుడు దశరథ రామ్ స్థానికంగా ఆర్ఎంపీగా పని చేస్తూ మద్యానికి బానిసై డబ్బుల కోసం నిత్యం తమపై దాడి చేసి కొడుతున్నాడు అన్నారు. పిల్లుట్లలో ఉన్న ఇల్లు, పొలం తన పేరున రాయాలని ఆదివారం రాత్రి కూడా తమపై దాడి చేసి కొట్టడంతో తన పళ్ళు ఊడిపోయాయని వెంకటరావు భయాందోళన వ్యక్తం చేశారు. దీంతో ఇంటి నుంచి పారిపోయి తాము సమీపంలోని బంధువుల ఇంటిలో తలదాచుకున్నామన్నారు.

అద్దె ఇవ్వడం లేదు...షాపు ఖాళీ చేయడం లేదు

లాలాపేటలోని చైత్ర సెంటర్లో ఉన్న తన షాపును అద్దెకు తీసుకున్న వ్యక్తి అద్దె ఇవ్వడంలేదని, షాపు ఖాళీ చేయడం లేదని దేశు వెంకట రవిశంకర్ సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. 2009లో తన తండ్రి సుబ్రహ్మణ్యం బాలాజీ టెంట్ హౌస్ నిర్వాహకుడు చెక్క గోపికి అద్దెకిచ్చాడన్నారు. అయితే కొద్ది నెలలుగా అద్దె కూడా చెల్లించడం లేదన్నారు దీంతో షాపు ఖాళీ చేయమంటే వేధిస్తున్నాడని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

నగరంపాలెం సీఐగా కిషోర్

గుంటూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నగరంపాలెం సీఐగా ఆర్ కిషోర్‌ను నియమించారు. ఇప్పటివరకు ఇక్కడ సిఐగా విధులు నిర్వహిస్తున్న నజీర్ బేగ్ కొద్దిరోజులుగా అనారోగ్య సమస్యలతో మెడికల్ లీవ్‌లో ఉన్నారు. ఈ నేపథ్యంలో తాత్కాలికంగా నగరంపాలెం సిఐగా సిసిఎస్ లో విధులు నిర్వహిస్తున్న కిషోర్ ను నియమించారు. సోమవారం కిషోర్ నగరంపాలెం పోలీస్‌స్టేషన్ లో బాధ్యతలు స్వీకరించారు

ట్రాఫిక్ డిఎస్పీగా బెల్లం శ్రీనివాస్

ట్రాఫిక్ డీఎస్పీగా బెల్లం శ్రీనివాసరావును అటాచ్‌మెంట్‌పై నియమించారు. ట్రాఫిక్ డీఎస్పీగా విధులు నిర్వహించిన రమేష్ కొద్ది నెలల క్రితం ఉద్యోగ విరమణ చేశారు. అప్పటినుంచి ట్రాఫిక్ డీఎస్పి పోస్టు ఖాళీగా ఉంది. దీంతో వీఆర్‌లో ఉన్న బెల్లం శ్రీనివాసరావును ట్రాఫిక్ డీఎస్పీగా అటాచ్‌మెంట్‌పై నియమించారు.

హ్యాకథాన్ పోటీలకు విజ్ఞాన్ నిరుల విద్యార్థినుల ఎంపిక

గుంటూరు (విద్య), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక పలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ నిరుల ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు స్మార్ట్ ఇండియా హకథాన్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పాతూరు రాధిక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో వివిధ విభాగాలకు చెందిన 378 మంది విద్యార్థినులు 63 బృందాలుగా ఎర్పడి ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్ పి ఓ సి కోఆర్డినేటర్ డాక్టర్ సత్య సందీప్ తదితరులు పాల్గొన్నారు.

మూతపడిన రహదారి పునరుద్ధరణకు చర్యలు

● కేంద్ర మంత్రి పెమ్మసాని చొరవతో పనులు

గుంటూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): హిందూ కళాశాల సెంటర్ నుంచి కలెక్టరేట్ వెళ్ళే దారిలో పోలీస్ పెట్రోల్ బంకు పక్కనున్న పాత క్వార్టర్స్ మధ్యలోని దారి పునరుద్ధరణకు కేంద్ర మంత్రి పెమ్మసాని చొరవతో చర్యలు తీసుకుంటున్నారు. ఆయా రోడ్డు పనులను 23వ డివిజన్ టీడీపీ నాయకుడు, మాజీ కార్పొరేటర్ గంటా పెద్దబ్బాయ్ పర్యవేక్షిస్తున్నారు. కార్యక్రమంలో ఖాసిం సైదా, గాదిరెడ్డి మురళీ, చలపతి, గంటా కిషోర్, రాజు, శ్రీనివాస్, గోపి తదితరులున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు మంజూరు చేయండి

● మంత్రి సంధ్యారాణికి ఎమ్మెల్యే నసీర్ విజ్ఞప్తి



శాసన సభలో మంత్రి సంధ్యారాణికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అంగన్వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే నసీర్ రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని కోరారు. రాష్ట్ర శాసన సభలో సోమవారం ఆయన మంత్రి సంధ్యారాణికి వినతి పత్రం అందజేశారు. తూర్పు నియోజకవర్గం అత్యంత వెనకబడిన ప్రాంతమని, జనాభా పెరిగిన దృష్ట్యా అంగన్వాడీ కేంద్రాల అవసరం అత్యవసరంగా ఉందని వివరించారు. నియోజకవర్గంలోని రాజీవ్ గృహకల్ప, ప్రగతి నగర్, సాయిబాబా కాలనీ, కొబ్బరికాయల సాంబయ్య కాలనీ ప్రాంతాల్లో అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. సాయిబాబా కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుకు స్థలం సిద్ధంగా ఉందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి సీఎం చంద్రబాబు తీసుకుంటున్న చర్యలు మంచి ఫలితాన్నిస్తున్నాయని వివరించారు. ఎమ్మెల్యే నసీర్ విజ్ఞప్తి మేరకు తూర్పు నియోజకవర్గంలో అంగన్వాడీ కేంద్రాల ఏర్పాటుకు మంత్రి సంధ్యారాణి సానుకూలంగా స్పందించారు.

వైసీపీ నేతల భూ దౌర్జన్యాలు మానుకోవాలి



వినతులు స్వీకరిస్తున్న మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): భూ వివాదాలు సృష్టించి సామాన్యులను బెదిరించి వైసీపీ నేతలు దౌర్జన్యాలు చేయడం మానుకోవాలని ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్ హెచ్చరించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కుటుంబ ఆస్తుల వివాదాన్ని అడ్డుపెట్టుకుని కొందరు వైసీపీ నేతలు తనను చంపేస్తామని బెదిరిస్తున్నారని సత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన కే. పద్మావతి వినతిపత్రం అందజేశారు. తమ పొలానికి రావాల్సిన కౌలు ఇవ్వకుండా అడ్డుపడి, పొలాన్ని కాజేయాలని చూసే కొందరు తమను బెదిరిస్తున్నారని సత్తెనపల్లి మండలం నందిగామకు చెందిన రావెళ్ల కరుణాకుమారి ఫిర్యాదు చేశారు. ఈ దౌర్జన్యాలపై వారు స్పందిస్తూ దౌర్జన్యాలకు పాల్పడే వైసీపీ నేతలు తమ ప్రవృత్తిని మార్చుకోవాలని హెచ్చరించారు.

జీఎస్టీ రేట్లు తగ్గించటం హర్షణీయం

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ కుమార్

గుంటూరు సిటీ, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ రేట్లు తగ్గించటం హర్షణీయం అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ అన్నారు. గుంటూరులో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీఎస్టీ రేట్లు తగ్గటం వల్ల దేశ ప్రజలతోపాటు, ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయంతో ప్రజలకు నిత్యవసరాలు గృహోపకరణ వస్తువులు అందుబాటులోకి వస్తాయని వివరించారు. దేశ ఆర్థిక వ్యవస్థకు రెండు లక్షల కోట్ల మేర మేలు జరుగుతుందని వెల్లడించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో ప్రతి కుటుంబంపై ఆర్థిక భారం తగ్గుతుందన్నారు మందులు, పెన్సిళ్లు, పెన్నులు, సిమెంటు, వంటి వాటిపై 18 శాతం జీఎస్టీ తగ్గించడం ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

మోదీ నిర్ణయంతో మధ్య తరగతికి పెద్ద ఉపశమనం : జూపూడి

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ రేట్లు తగ్గిస్తూ మోదీ తీసుకున్న నిర్ణయంతో మధ్యతరగతి ప్రజలకు, చిరు వ్యాపారస్తులకి ఊరట చేకూరుతుందని బీజేపీ సీనియర్ నాయకుడు జూపూడి రంగరాజు అన్నారు. జీఎస్టీ రేట్లు తగ్గించినందుకు సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో నగరంలో విజయోత్సవ ర్యాలీ, అనంతరం మోదీకి పాలాభిషేకం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో దేశ ప్రజలకు నాణ్యమైన విద్యను మరింతగా చేరువ చేస్తాయన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ దేశ అభివృద్ధి దిశలో ఒక కీలకమైన మలుపు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈదర శ్రీనివాస్ రెడ్డి, భీమినేని చంద్రశేఖర్, పాలపాటి రవికుమార్, వెలగలేటి గంగాధర్, టీవీ రావు, చరక కుమార్ గౌడ్, వైవీ సుబ్బారావు, మంత్రి సుగుణ, విమలాదేవి, సరోజిని, సాదు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏ పంజరానికి చిక్కని విశ్వనరుడు గుర్రం జాషువా



గురజాడ దంపతులను సత్కరిస్తున్న మాణిక్యవరప్రసాదు, రసరాజు తదితరులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): సాహితి సేవలో ఏ పంజరానికి చిక్కకుండా తానకు తానుగా విశ్వనరుడుగా ప్రకటించుకున్న గొప్ప పండితుడు గుర్రం జాషువా అని అనంతపురం తెలుగు శాఖ కేంద్రీయ విశ్వవిద్యాలయం, సహాయ ఆచార్యులు, శాఖాధ్యక్షులు డాక్టర్ గరికపాటి గురజాడ అన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై సోమవారం జాషువా కళాపీఠం అధ్యక్షుడు మాజీమంత్రి డొక్కా మాణిక్యవరప్రసాదు ఆధ్వర్యంలో మహాకవి జాషువా 130వ జయంతి వారోత్సవాల సభ జరిగింది. గురజాడ ప్రసంగిస్తూ దేశభక్తి, దైవభక్తితో పాటు సామాజిక దృష్టిలో జాషువా రచనలు కొనసాగించారన్నారు. సినీ గేయ రచయిత రసరాజు మాట్లాడుతూ ప్రతి ప్రశ్నకు సమాధానం జాషువా పద్యాల్లో గోచరిస్తాయని అన్నారు. అనంతరం పముఖ కవులు కోయి కోటేశ్వరరావు, రసరాజు, అనిల్ డ్యానియల్, గరికపాటి గురజాడ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ చైర్మన్ డి.రాములు, విశ్రాంత డి.ఐ.జి. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రార్ చావలి బాలస్వామి, ఆలయ కమిటి అధ్యక్షుడు చిట్టిపోతు మస్తానయ్య, కవి దేవరపల్లి ప్రభుదాస్, సాహితీ పరిశోధకులు పారా అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా అరెస్టు

● ఎనిమిది ద్విచక్ర వాహనాలు, మూడున్నర కిలోల గంజాయి స్వాధీనం

గుంటూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహన చోరీలు, అదేవిధంగా గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర నిందితుల ముఠాను అరండల్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. 8 మంది నిందితులను అరెస్టు చేసి వారి నుంచి మూడున్నర కిలోల గంజాయి, ఏడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సోమవారం అరండల్ పేట పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వెస్ట్ డీఎస్పీ అరవింద్ అరండల్ పేట సీఐ ఆరోగ్య రాజు నిందితులను మీడియా ఎదుట హాజరు పరిచి వివరాలు వెల్లడించారు. ఈ కేసులో శ్రీనగర్ 5/6 కు చెందిన పెయింటర్ ఇంజాపల్లి మేరీ బాబు, వెంగళరావు నగర్ 2/6 కు చెందిన పెయింటర్, చెప్పులు విక్రయించే యద్దనపూడి దీనా భాస్కర్, శారదా కాలనీ 24వ లైన్ కి చెందిన బడుగు ప్రభు కుమార్, బేల్దారుపని చేసే గోరంట్లలోని హోసన్నా మందిర్ ప్రాంతానికి చెందిన పనిధరపు అమర జ్యోతి, వెంగళరావునగర్ ఐదవ లైనుకు చెందిన ఆటో డ్రైవర్ వేటూరి ఎల్జిబిత్ రాజు అలియాస్ రాజు, శివ నాగరాజు కాలాని 13వ లైన్‌కి చెందిన తూతిక అలియాస్ పాతూరి సైని అలియాస్ హనీ, ఒడిస్సా రాష్ట్రంలోని నోవాకూడా ప్రాంతానికి చెందిన ఫారిమా జోయా మాజి తోపాటు చట్టంతో విభేదించిన మరో బాలుడు సహా మొత్తం ఎనిమిది మందిని అరండల్ పేట పోలీసులు అరెస్టు చేశారు. ఎస్పీ రకుల్ జిందాల్ ఆదేశాల మేరకు వెస్ట్ డి.ఎస్.పి అరవింద్ ఆధ్వర్యంలో అరండల్ పేట సీఐ గంగా వెంకటేశ్వర్లు, ఎస్సైలు కృష్ణ బాజీ, సుబ్బారావు, హెడ్ కానిస్టేబుల్, కే చిరంజీవిలు, కానిస్టేబుళ్లు డేవిడ్ సిబ్బంది ద్విచక్ర వాహనాలు అదేవిధంగా పెద్ద మొత్తంలో గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ అరవింద్ తెలిపారు.



అమరావతి : రజిత కవచంతో దర్శనమిస్తున్న బాలచాముండికా అమ్మవారు



పెదకాకాని : బాల త్రిపుర సుందరీ దేవిగా భ్రమరాంబ అమ్మవారు



మంగళగిరి : ఎర్రచెరువు వద్ద కొలువైన శ్రీ కాళీమాత అమ్మవారు

వైభవంగా దసరా ఉత్సవాలు ప్రారంభం

- శ్రీ బాలాత్రిపురసుందరీదేవి రూపంలో అమ్మవారి దర్శనం
- దేవాలయాల్లో ప్రత్యేక పూజలు

గుంటూరు/నరసరావుపేట/మంగళగిరి సిటీ/పెదకాకాని/ అమరావతి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దసరా మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తొలిరోజు పలు ఆలయాల్లో అమ్మవారు శ్రీ బాలాత్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవాలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చి అమ్మవారి అలంకారాలను దర్శించుకొని పూజల్లో పాల్గొన్నారు. గుంటూరు నగరంలోని ఏటుకూరు రోడ్డులో ఉన్న శ్రీ కన్యకా పర మేశ్వరి ఆలయంలో అమ్మవారు తొలి రోజున శ్రీ బాలత్రిపుర సుంద రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నరసరావుపేట పట్టణంలోని పాతూరు శ్రీ గంగా పార్వతి సమేత శ్రీ భీమలింగేశ్వర స్వామి ఆలయంలో పార్వతీదేవి అమ్మవారికి బాలాత్రిపురసుందరీ దేవిగా అలంకారం చేశారు. అమరావతి శ్రీ భ్రమరాంబదేవి అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమరావతి బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో అమ్మవారిని రజిత కవచధారిణిగా అలంకరించారు. పెదకాకాని శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ భ్రమరాంబదేవి అమ్మవారు బాలాత్రిపురసుందరీ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళగిరి శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో శ్రీ రాజ్యలక్ష్మీ అమ్మవారు రాజ్యలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉమ్మడి జిల్లాలోని పలు పట్టణాలు, గ్రామాల్లో దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.



నరసరావుపేట : శ్రీ శృంగేరి శంకర మఠంలో బ్రహ్మి అలంకారంలో అమ్మవారు



గుంటూరు : శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రీ బాలత్రిపుర సుందరీదేవి అలంకరణలో అమ్మవారు

విజ్ఞాన అమరావతి



● రాజధానిలో ప్రపంచ ఖ్యాతి సెంట్రల్ లైబ్రరీ

రాజధాని అమరావతి అంటేనే మరో ప్రపంచమన్న నానుడి ఇటీవలి కాలంలో బాగా ప్రబలమైపోయింది. ఇక్కడ ఏ నిర్మాణమైనా.. అది అంతర్జాతీయ ప్రమాణాలతో.. ప్రపంచ మేటిగా ఉండాలన్న లక్ష్యంగా సాగుతోంది. ఇపుడు తాజాగా రాజధాని అమరావతిలో అతి పెద్ద గ్రంథాలయం ఆవిర్భవించబోతున్నట్టు రాష్ట్ర విద్యా, ఐటీ, మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి నారా లోకేశ్ అసెంబ్లీలో ప్రకటించారు. ఈ గ్రంథాలయం సుమారు రెండు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు కాబోతుంది. ఈ సెంట్రల్ లైబ్రరీ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం అయిదు నుంచి పదెకరాల స్థలాన్ని కేటాయించాల్సి ఉంటుంది. మంత్రి లోకేశ్ అసెంబ్లీలో ప్రకటన చేసినా.. రాజధానిలో దానిని ఏ ప్రాంతంలో నిర్మిస్తున్నారనే అంశమై స్పష్టత ఇవ్వలేదు. అయితే అమరావతిలోని నవ నగరాల్లో ఒకటైన నాలెడ్జి సిటీలోనే దీనిని నిర్మించాల్సి ఉంటుంది. నాలెడ్జి సిటీ విస్తరించిన తుళ్లూరు, శాఖమూరు, ఐనవోలు, మల్కాపురం ప్రాంతాల్లోనే ఈ సెంట్రల్ లైబ్రరీ ఆవిష్కృతమయ్యే అవకాశముంది.

- రూ.150 కోట్లతో అద్భుతంగా నిర్మాణం
- జ్ఞాన కేంద్రంగా... టెక్నాలజీ హబ్‌గా..
- అత్యాధునిక వసతులతో రెండేళ్లలో పూర్తి..
- అసెంబ్లీలో మంత్రి లోకేశ్ ప్రకటన

(మంగళగిరి, ఆంధ్రజ్యోతి)

అమరావతిలో ఏర్పాటుకానున్న ఈ సెంట్రల్ లైబ్రరీ దేశంలోనే అతిపెద్ద గ్రంథాలయంగా ఆవిర్భవించనుంది. ప్రస్తుతానికి కోల్‌కతాలో ఉన్న నేషనల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా అతిపెద్దదిగా ప్రాచుర్యంలో ఉంది. తర్వాతి స్థానాల్లో ఢిల్లీ పబ్లిక్ లైబ్రరీ, తంజావూరులోని సరస్వతీ మహల్ లైబ్రరీ ఉన్నాయి. సరస్వతీ మహల్‌కున్న మరో అరుదైన ప్రాముఖ్యత దేశంలోని వివిధ ప్రాంతీయ భాషల్లో ఉన్న తాళపత్ర గ్రంథాలు ఇక్కడ కచ్చితంగా అందుబాటులో ఉంటాయి. అందుకే సరస్వతీ మహల్‌కు జాతీయస్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో కూడా ఓ ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఇప్పుడు అమరావతిలో రూపుదిద్దుకోనున్న సెంట్రల్ లైబ్రరీ కూడా అటు విస్తీర్ణంలోను, ఇటు కేటలాగ్‌లోనూ అతిపెద్ద గ్రంథాలయంగా ఆవిర్భవించడంతోపాటు అత్యాధునిక వసతులతో సాంకేతిక విలువలతో అగ్రగామిగా నిలవనుంది. మంత్రి లోకేశ్ మాటల్లో చెప్పాలంటే...దీనిని ప్రపంచస్థాయి నాలెడ్జ్ హబ్‌గా అభివృద్ధి చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.



సెంట్రల్ లైబ్రరీ గురించి అసెంబ్లీలో ప్రకటన చేస్తున్న మంత్రి నారా లోకేశ్

అడుగులు పడింది ఇలా...

రాష్ట్రంలో సెంట్రల్ లైబ్రరీ ఆవశ్యకతను గురించి మాజీ మంత్రి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. యువతను సరైన మార్గంలో నడిపించేందుకు రాష్ట్రంలో గ్రంథాలయాల పునర్వికాస ప్రక్రియ చాల ఆవశ్యమన్న విషయాన్ని బుద్ధప్రసాద్ మంత్రి లోకేశ్ వద్ద ప్రస్తావించారు. ఆయన సెంట్రల్ లైబ్రరీ అంశమై సానుకూలంగా స్పందిస్తూ గత ఆగస్టు 22న ఓ ప్రకటన చేశారు. తాజాగా అసెంబ్లీ సమావేశంలో మంత్రి లోకేశ్ మరోమారు సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటు ప్రక్రియను వివరించారు. అమరావతిలో రూ.150 కోట్ల భారీ వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రపంచ శ్రేణి గ్రంథాలయంగా దీనిని నిర్మిస్తామని చెప్పారు. త్వరలోనే నిర్మాణం ప్రారంభించి.. రెండేళ్లలో పూర్తి చేస్తామన్నారు. దీంతోపాటు రాష్ట్రంలోని అన్నీ గ్రంథాలయాల్లో మౌలిక వసతులను మెరుగుపరచడంతోపాటు మాన్యు స్క్రిప్ట్ కాపాడేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచే అంశాన్ని సీరియస్‌గా తీసుకుంటూ.. రాబోయే ఆరుమాసాల్లోనే గ్రంథాలయ వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చేలా నిర్మాణాత్మక చర్యలు చేపడుతున్నామని లోకేశ్ సభలో వివరించారు. అలాగే రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గ కేంద్రంలో మోడల్ లైబ్రరీలను ఏర్పాటు చేస్తామని, ప్రస్తుతం ఉన్న 13 జిల్లా గ్రంథాలయాలతోపాటు నూతనంగా ఏర్పాటైన జిల్లాల కేంద్రాల్లో కూడా గ్రంథాలయాలను నిర్మిస్తామని మంత్రి లోకేశ్ తెలిపారు. తన నియోజకవర్గమైన మంగళగిరిలో ఇప్పటికే చేపట్టిన మోడల్ లైబ్రరీ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని, అక్టోబరులో దానిని ప్రారంభిస్తామని చెప్పారు.

లైబ్రరీ ప్రత్యేకతలు ఎన్నెన్నో...

అమరావతిలో ఏర్పాటు కానున్న సెంట్రల్ లైబ్రరీ రాష్ట్ర ఖ్యాతిని మరింత ఇనుమడించేలా ఉండాలన్నది.. ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. ఇందుకోసం భవన నిర్మాణం మొదలు.. అందులోని సదుపాయాలన్నీ అత్యంత ఆధునికంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆధునిక డిజిటల్ లైబ్రరీ, ఈ -బుక్స్ యాక్సెస్, ఇంటర్నెట్ ల్యాబ్స్, స్టడీ రూమ్స్, గ్రూప్ డిస్కషన్స్‌కు ఉపకరించేలా హాల్స్, ఆడియో అండ్ వీడియో విజువల్ రిసోర్స్ సెంటర్ల వంటి అన్నీ వసతులను ఇక్కడ అందుబాటులోకి తెస్తారు. అలాగే వివిధ రకాల పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం ప్రత్యేక విభాగాలు, సైలెంట్ రీడింగ్ రూమ్స్, రిఫరెన్స్ విభాగాలు ఈ లైబ్రరీ ప్రత్యేకతలుగా ఉంటాయి. కేవలం విద్యార్థుల కోసమే కాకుండా వివిధ రంగాలపై పరిశోధన పత్రాలు, గణాంకాలు, ఈ-జర్నల్స్, ఇంటర్నేషనల్ పబ్లికేషన్స్ ప్రాచీన గ్రంథాలన్నీ అందుబాటులో ఉంటాయి. ఇంతే కాకుండా వయసు రీత్యా వివిధ కేటగిరీల వారీగా కూడా ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసే ప్రణాళిక ఉంది. చిన్నారుల కోసం కిడ్స్ కార్నర్, సీనియర్ సిటిజన్ల కోసం రిఫరెన్స్ లాంజ్, సాంకేతిక విద్యలో రీసెర్చి కోసం ఐటీ, సాఫ్ట్‌వేర్ సంబంధిత పుస్తకాలతో కూడిన విభాగాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తారు.

అమరావతి ఖ్యాతిని ఇనుమడించేలా...

ప్రపంచశ్రేణి నగరాల్లో ఒకటిగా బాసిల్లనున్న అమరావతికి ఈ సెంట్రల్ లైబ్రరీ పెద్ద వనరుగా ఉపకరించనుంది. రాబోయే రోజుల్లో ఈ లైబ్రరీ వేదికగా అంతర్జాతీయ సదస్సులు, సాహిత్య ఉత్సవాలు, మరెన్నో పరిశోధనా కార్యక్రమాలు జరుగుతాయి. అమరావతిని జ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యానికి ఈ గ్రంథాలయం ఎంతో దోహదపడనుంది.

బీచ్ ఫెస్టివల్ వాయిదా

● భారీ వర్షాల సూచనల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సూర్యలంక తీరంలో ఈ నెల 26, 27, 28వ తేదీలలో నిర్వహించ తలపెట్టిన బీచ్ ఫెస్టివల్‌ను వాయిదా వేస్తున్నట్లు టూరిజం విభాగం జిల్లా అధికారి నాగి రెడ్డి సోమవారం తెలిపారు. ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు కూడా బీచ్ పండుగకు హాజరవుతారని గతంలోనే యంత్రాంగం ప్రకటించింది. అందుకు తగ్గట్లే ఏర్పాట్లను కూడా ప్రారంభించారు. అయితే ఈ వారంలో అల్పపీడనాల ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ సూచనల నేపథ్యంలో ఫెస్టివల్‌ను వాయిదా వేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. బీచ్ ఫెస్టివల్ నిర్వహణ సాధ్యాసాధ్యాలను పరిశీలించడానికి ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి సోమవారం సూర్యలంక తీరానికి వచ్చారు. ఈ నెల 26, 27వ తేదీల్లో వాతావరణ పరిస్థితులపై చర్చించారు. ప్రతికూల పరిస్థితుల్లో బీచ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయడం కష్టమేననే అభిప్రాయాన్ని ఎండీ ముందు జిల్లా యంత్రాంగం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇవే అంశా లను ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా బీచ్ ఫెస్టివల్‌ను వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకుంది. త్వరలో వేరే తేదీల్లో బీచ్ పండుగను నిర్వహిస్తామని పర్యాటకశాఖ తెలిపింది.



సూర్యలంక తీరంలో పర్యటిస్తున్న ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి, కలెక్టర్ వినోద్‌కుమార్

బ్రహ్మోత్సవాల్లో సామాన్యులకే ప్రాధాన్యం

» 'ఆంధ్రజ్యోతి'తో టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్

(తిరుమల-ఆంధ్రజ్యోతి)

కలియుగ వైకుంఠం తిరుమల బ్రహ్మోత్సవ సంరంభానికి సిద్ధమైంది. లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా శ్రీవేంకటేశ్వరస్వామి వారి దర్శనం కల్పించేలా అన్ని ఏర్పాట్లు చేశామని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. అన్ని విభాగాలను సమన్వయం చేసుకుంటూ ప్రణాళిక మేరకు బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తామని చెప్పారు. బుధవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జరుగనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

సామాన్య భక్తులకే ప్రాధాన్యం

తిరుమల పవిత్రత కాపాడుకుంటూ సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బ్రహ్మోత్సవాలు నిర్వహించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. దానికి అనుగుణంగా బోర్డు సభ్యులు, అధికారులందరం కలిసి నిర్ణయాలు తీసుకున్నాం. ఎస్ఎస్‌డీ (స్లాటెడ్ సర్వదర్శనం) టోకెన్ల కోటా పెంపుతో పాటు ఆన్‌లైన్ రూ.300 దర్శన టికెట్లు అధికంగా ఇచ్చాం. నేరుగా తిరుమలకు వచ్చే సామాన్య భక్తులకే అధిక సంఖ్యలో గదులు కేటాయించేలా చర్యలు చేపట్టాం. వాహన సేవలు వీక్షించేందుకు మాడవీధుల్లోకి వచ్చే, వెలుపల ఉండే భక్తులకు నిరంతరాయంగా అన్న ప్రసాదాల వితరణ, 110 మందితో వైద్య సేవలు అందించేలా ప్రణాళికలు రూపొందించాం.

పటిష్ఠ భద్రత


సెక్యూరిటీ పేరుతో మాడ వీధుల్లోకి భక్తులు ప్రవేశించే సమయంలో ఇబ్బందులు పెట్టకూడదని నిర్ణయించాం. భద్రత కల్పనలో లోపాలు లేకుండా దాదాపు 6 వేల మందితో సేవలందించాలని ఆదేశాలిచ్చాం. గరుడ సేవ రోజు అదనంగా మరో 1,300 మంది బందోబస్తులో భాగస్వాములు కానున్నారు. దాదాపు 3 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. వీటిద్వారా రియల్ టైంలో మానిటర్ చేస్తాం. కమాండ్ కంట్రోల్ రూం నుంచి అన్నిటినీ నిరంతరాయంగా పరిశీలిస్తుంటారు.

సమన్వయ లోపాలకు చెక్

టీటీడీ, పోలీసు, విజిలెన్స్ అధికారులతో కొన్ని బృందాలను ఏర్పాటు చేశాం. వారు మాడ వీధుల్లోని గ్యాలరీల వద్ద సెక్టార్ల వారీగా విధులు నిర్వహిస్తారు. భక్తులతో నేరుగా మాట్లాడతారు. ముందస్తు ప్రణాళికలను అమలుచేస్తారు. శ్రీవారి సేవకులు కూడా గ్యాలరీల్లోనే ఉంటూ భక్తులకు సేవలందించడంతో పాటు ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకొస్తారు. ఈసారి సమన్వయ లోపానికి ఆస్కారం లేదు.

రూ.25 కోట్లతో ఏర్పాట్లు

సామాన్య భక్తులకు ఇబ్బంది లేకుండా సంతృప్తికర, ఆధ్యాత్మిక, ఆహ్లాదకర సంతోషాన్ని కల్పించడమే మా ప్రధాన లక్ష్యం. గతానికంటే భిన్నంగా రూ.25 కోట్లతో ఈసారి ఏర్పాట్లు చేపట్టాం. రూ.9.50 కోట్లతో ఇంజనీరింగ్ పనులు, రూ.5.30 కోట్లతో విద్యుద్దీపాలంకరణలు చేపట్టాం. దాతల సహకారంతో మరో రూ.3.50 కోట్లతో 60 టన్నుల పుష్పాలతో అలంకరణలు చేయనున్నాం. అన్న ప్రసాదాలు, ఇతర ఖర్చులకు రూ.25 కోట్లతో బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేపట్టాం.



4 వేల వాహనాలకు పార్కింగ్ సిద్ధం

4 వేల వాహనాలకు సరిపడా పార్కింగ్ ప్రదేశాలను తిరుమలలో సిద్ధం చేశాం. అంతకు మించి వస్తే తిరుపతిలోని పార్కింగ్ ప్రదేశాలకు మళ్లిస్తాం. బ్రహ్మోత్సవాల్లో ప్రతి రోజూ 1,900 ట్రిప్పులు, గరుడ సేవ రోజున మూడు వేల ట్రిప్పులను తిప్పేందుకు ఆర్టీసీ ప్లాన్ చేసింది.

కార్నర్ పాయింట్స్ నుంచి దర్శనం

మాడ వీధుల్లోని గ్యాలరీల్లో 1.80 నుంచి దాదాపు 2 లక్షల మంది కూర్చుని వాహన సేవలను వీక్షించే అవకాశముంటుంది. రెండేళ్ల నుంచి మాడవీధుల్లోని నాలుగు కార్నర్ పాయింట్ల నుంచి భక్తులను క్యూలైన్ ద్వారా అనుమతించి దర్శనం కల్పిస్తున్నాం. 45 నిమిషాల పాటు వాహనాన్ని కార్నర్ పాయింట్లలో ఉంచి హోల్డింగ్ పాయింట్ల ద్వారా భక్తులను అనుమతించి దర్శనం చేయిస్తాం. గతేడాది ఈ పాయింట్ల ద్వారా 16 వేల మందికి దర్శనం చేయిస్తే ఈసారి దాదాపు 30 వేల మందికి దర్శనం చేయించేలా ప్రణాళిక రూపొందించాం.

298 కళా బృందాల ప్రదర్శనలు

దాదాపు 28 రాష్ట్రాల నుంచి 298 బృందాలు ఉత్సవాల్లో పాల్గొంటాయి. గరుడ వాహన సేవ రోజు 20 రాష్ట్రాల నుంచి 37 బృందాలు ప్రదర్శనలు ఇస్తాయి. 20 హెల్ప్ డెస్క్‌ల ద్వారా ఐదు భాషల్లో ప్రసారాలు ఇవ్వడంతో పాటు టీటీడీ అందిస్తున్న సేవలను భక్తులకు వివరిస్తాయి.

పూర్వ జన్మ సుకృతం

రెండవసారి టీటీడీ ఈవోగా అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు. ఒక్కసారి ఈవో కావడమే పూర్వ జన్మ సుకృతంగా భావిస్తారు. అలాంటిది నేను రెండోసారి ఈవో అయ్యాను. మొదటిసారి ఈవోగా నియమితమైనప్పుడు చాలా మంది నార్త్ ఇండియన్, సౌత్ ఇండియన్ అంటూ చర్చలు పెట్టారు. కానీ రెండోసారి ఈవోగా వస్తుంటే చాలా మంది స్వాగతించారు. ఇప్పటికే నాలుగు బ్రహ్మోత్సవాలు పూర్తిచేసిన అనుభవంతో ఐదో బ్రహ్మోత్సవాన్ని వైభవంగా, వివాదరహితంగా నిర్వహిస్తాననే గట్టి నమ్మకముంది.

ఆన్‌లైన్ అమ్మకం..బాదుడు!

(5వ పేజీ తరువాయి)

70 మంది ఈ-కామర్స్ సంస్థల ద్వారానే వస్తువులు కొనుక్కుంటున్నారని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. వీరందరి నుంచి ఈ సంస్థలు వివిధ రూపాల్లో అదనపు ఫీజులు వసూలు చేస్తున్నాయి.



రకరకాల ఫీజుల మోత..!

ఒక ఈ-కామర్స్ సంస్థ తన వెబ్‌సైటును వినియోగించుకున్నందుకు ప్లాట్‌ఫాం ఫీజు కింద రూ.5 నుంచి రూ.15, సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ ఫీజు పేరుతో రూ.49 నుంచి రూ.59 వసూలు చేస్తోంది. అలాగని ఆర్డర్ పెట్టిన వస్తువు రాకపోతే మాత్రం సంస్థ బాధ్యత తీసుకోవడం లేదు. వీటితోపాటు ఆఫర్ హోల్డింగ్ ఫీజు పేరుతో రూ.149, ఎక్స్‌ఛేంజ్ ఆఫర్ కింద పికప్ చార్జీ పేరుతో రూ.99 నుంచి రూ.199 వరకూ వసూలు చేస్తోంది. తాజాగా మరో సంస్థ కూడా ఇదే తరహాలో ఫీజుల వసూలు మొదలు పెట్టింది.

● వస్తువు రాకుంటే ఫీజులు గల్లంతే..!

ఇంత ఖర్చు చేసి ఒక వస్తువును ఆర్డర్ చేస్తే అది వినియోగదారుడి చేతికి అందితే అదృష్టమే. అందలేదంటే ఆ ఫీజులు మొత్తం పోయినట్లే లెక్క! ఆర్డర్ చేసిన తర్వాత ఆ వస్తువు అమ్మకందారు పంపించకపోయినా, అతడే ఆర్డర్ క్యాన్సిల్ చేసినా సరే.. అదనంగా చెల్లించిన ఫీజులు తిరిగి రావు. కేవలం వస్తువు ఖరీదు మాత్రమే వస్తోంది. దీంతో వినియోగదారులు అనేక మంది లబోదిబోమంటున్నారు. సేవలను అందించామనే పేరుతో ఈ కామర్స్ సంస్థలు ఫీజులు మాత్రం తిరిగి ఇవ్వడం లేదు. ఇటీవలి కాలంలో ఇలాంటి ఫిర్యాదులు వేల సంఖ్యలో వస్తున్నాయి.

● రిటర్న్ విండో మూసివేత..

ఈ-కామర్స్ సంస్థ లు క్రమంగా రిటర్న్ విండోను మూ సేస్తున్నాయి. తొలి నాళ్లలో నెల రోజులపాటు రిటర్న్ ఆప్షన్ అందు బాటులో ఉండేది. ఈ సమయంలో ప్రొడక్టుకు ఏదైనా సమస్య వస్తే తిరిగి పంపించే అవకాశం ఉండేది. తిరిగి కొత్త ప్రొడక్టును గానీ,



లేదా చెల్లించిన మొత్తాన్ని కానీ రీఫండ్ చేసేవారు. తర్వాత ఈ సమయాన్ని పక్షం, వారం రోజులకు కుదించారు. ఇప్పుడైతే పూర్తిగా ఆ ఆప్షన్‌ను ఎత్తేశారు. రీప్లేస్‌మెంట్ అవకాశాన్ని మాత్రమే ఇస్తున్నారు. ఇందులో కూడా సర్వీస్ సెంటర్ రీప్లేస్‌మెంటు ఆప్షన్‌ను మాత్రమే ఎక్కువగా ఇస్తున్నారు. అంటే వస్తువు ఒకసారి వినియోగదారుడి చేతికి చేరిదంటే ఆ వస్తువుతో ఈ-కామర్స్ సంస్థకు ఎలాంటి సంబంధం లేదన్నమాట! ఆ వస్తువును తీసుకుని సంబంధిత కంపెనీ సర్వీస్ సెంటర్ చుట్టూ తిరగాల్సిందే! ఆథరైజ్డ్ సెల్లర్ దగ్గర తీసుకున్న ప్రొడక్టు అయితేనే సర్వీస్ సెంటర్ సేవలు అందిస్తుంది. థర్డ్ పార్టీ సెల్లర్ దగ్గర తీసుకుంటే మాత్రం ఇక అంతే సంగతులు. ఈ నేపథ్యంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండడం ఎంతైనా అవసరం.

విజ్ఞాన్‌లో కొనసాగుతున్న జాతీయ చెస్ ఛాంపియన్‌షిప్

గుంటూరు (విద్య) సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో ప్రారంభమైన 62వ జాతీయ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలు కొనసాగుతున్నాయి. ఈ పోటీల్లో 14 మంది గ్రాండ్‌మాస్టర్లు, 30 మంది ఇంటర్నేషనల్ మాస్టర్లు సహా మొత్తం 394 మంది బరిలోకి దిగినట్లు టోర్నమెంట్ డైరెక్టర్ కె జగదీష్ వెల్లడించారు. వారిలో 391 మంది రేటెడ్ ప్లేయర్లు ఉన్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఆటగాడు, 2017 జాతీయ చాంపియన్ లలిత్ బాబు, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన గగన్ సాహూను ఓడించి తదుపరి రౌండ్‌కు చేరుకున్నాడు.



పోటీల్లో పాల్గొన్న చెస్ క్రీడాకారులు

వర్షాకాలం జాగ్రత్తలతో రోగాలకు దూరం

తహసీల్దార్ జే ప్రసాదరావు

ఫిరంగిపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ప్రజలు ముందుజాగ్రత్తలు తీసుకుంటే రోగాలు దరిచేరవని తహసీల్దార్ జే ప్రసాదరావు అన్నారు. సోమవారం ఫిరంగిపురం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాగునీటిని క్లోరినైజేషన్ చేయాలని, మురుగు కాలువల్లో నీరు పారేలా చేయాలని, వ్యక్తి గత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో కే రవి బాబు, ఎంపీపీ సహేల నర్గీస్, మండల వైద్యాధికారులు, సూపర్ వైజర్లు, వీఆర్‌వోలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వధూవరులకు పెళ్లికానుక అందజేత

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిలో 9వ వార్డులోని వివాహానికి హాజరై వధూవరులు చంద్రిక-నానిబాబులకు మంత్రి లోకేశ్ పంపిన పెళ్ళికానుకను సోమవారం స్థానిక నేతలు అందజేశారు. నియోజకవర్గ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గ కుటుంబానికి మంగళసూత్రం పథకం కింద మంగళసూత్రం అందజేశారు. కార్యక్రమంలో మంగళగిరి పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, తాడేపల్లి స్థానిక నేతలు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

చదువు నిమిత్తం ఓ విద్యార్థికి రామ్ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థికసాయం అందజేసింది. తాడేపల్లి మండలం చిర్రావూరు గ్రామానికి చెందిన కాటూరి గోపిచంద్, ఎంబీఏ చదువుతూ ఆర్థిక అవసరాల నిమిత్తం ట్రస్ట్ వ్యవస్థాపకులు, రామ్ హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ వలగాని శ్రీనివాసరావు సోమవారం ఆ విద్యార్థికి రూ.10వేలను చెక్కు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో కంచర్ల కాశయ్య, కాటూరి రాము, లచ్చి తుల సీదాస్, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ సర్టిఫికెట్లతో ఎంతో ఉపయోగం

పదవ తరగతి విద్యార్థులతోపాటు ఎంపిక చేసుకున్న విద్యార్థులకు అదనపు శిక్షణ, ఒకేషనల్ ట్రైనింగ్ ఇచ్చి, పరీక్ష నిర్వహించి, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఒకేషనల్ ట్రైనింగ్ సర్టిఫికెట్ ఎంతో ఉపయోగపడుతుందని తాడేపల్లి కేవీఆర్ జడ్పీ హైస్కూల్ హెచ్ఎం బీమిరెడ్డి తాతిరెడ్డి తెలిపారు. పైచదువులకు ఈ సర్టిఫికెట్ ప్రత్యేక అర్హతగా గుర్తింపు ఉందన్నారు. ఈ విద్యా సంవత్సరం శిక్షణలో భాగంగా పదవ తరగతి విద్యార్థులకు ఆటోమోటివ్ ట్రేడ్ దసరా సెలవుల పదిరోజుల్లో ఇంటర్న్‌షిప్‌లో భాగంగా సోమవారం 23మంది ని తాడేపల్లిలోని వివిధ రకాల మెకానిక్ షాపులు, కార్ గ్యారేజిలకు పంపించామని హెచ్ఎం తెలిపారు. కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్ అరవింద్ పాల్గొన్నారు.

నూజివీడు సీడ్స్ అధినేత మండవ వెంకట్రామయ్యకు నివాళి

దుగ్గిరాల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): నూజివీడు సీడ్స్ ద్వారా వేలాదిమందికి ఉద్యోగావకాశాలు కల్పించి.. చిలువూరుతో ప్రత్యేక అనుబంధం కలిగిన మండవ వెంకట్రామయ్య(95) మృతికి స్థానిక టీడీపీ నాయకులు తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుమారుడు మండవ ప్రభాకర్ ఇటీవల రాష్ట్రంలో సీఎం చంద్రబాబు తలపెట్టిన పీ-4 ద్వారా 100 కుటుంబాలను దత్తత తీసుకుని తండ్రి ఆదర్శాలను ఆలోచనలను ముందుకు తీసుకువెళుతున్నారు.

జాషువా జయంతి సభను జయప్రదం చేయండి

పెదనందిపాడు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): గుర్రం జాషువా 130వ జయంతి జయప్రదం చేయాలని జాషువా విజ్ఞాన కేంద్ర మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు పిలుపునిచ్చారు. స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో సోమవారం ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. సభలో కవులు, కళాకారులు, సాహితీప్రియులు, అభ్యుదయవాదులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో విజ్ఞాన కేంద్ర కన్వీనర్ దొప్పలపూడి రమేష్‌బాబు, కో కన్వీనర్ కొత్త వెంకటశివ, సభ్యులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యం.. కుటుంబానికి బలం

మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం బలంగా ఉంటుందని వైద్యాధికారి నందకుమార్ అన్నారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వరగాని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన వైద్యశిబిరాన్ని వైద్యాధికారి నందకుమార్ ప్రారంభించి, మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ప్రసాదస్వామి, ఎంపీహెచ్ఎస్ పి అరుంధతి, జి శ్రీనివాసరావు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆ పాఠశాలలో ఆయాను తొలగించాం

● ఎంఈవో రేణుక

ప్రత్తిపాడు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావిపాటివారిపాలెం పాఠశాలలో ఆయాగా పనిచేస్తున్న వాసిమళ్ల నాగమ్మను విధుల నుండి తొలగించామని డీఈవో రేణుక ఒక ప్రకటనలో తెలిపారు. రావిపాటివారిపాలెం పాఠశాలలో ఆయా భర్త చిన్నారుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన నేపథ్యంలో ప్రాథమిక విచారణ అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇప్పటికే తల్లిదండ్రుల ఫిర్యాదుమేరకు నాగమ్మభర్తపై ఫోక్సోకేసు నమోదుచేసినట్లు చెప్పారు.

మందడంలో బీజేపీ స్వచ్ఛ భారత్..

తుళ్లూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మందడం గ్రామంలో బీజేపీ శ్రేణులు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. శివాలయం పరిసర ప్రాంతాలలో చెత్తను ఏరివేశారు. స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని మండలంలో నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో తాడికొండ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య, మండల అధ్యక్షుడు నీరుకొండ లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు సరిపూడి సాంబశివరావు, జిల్లా నాయకులు మార్త నరేంద్రబాబు, కోళ్లపూడి హేమసుందర్, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పౌష్టికాహార ప్రదర్శనలు

ఫిరంగిపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని 113 తాళ్ళూరు, వేమవరం గ్రామాల్లో నుదురుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించారు. 200మంది మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు మండవ నరసింహారావు, డేగల సీతారామయ్య, కార్యదర్శి జోజిబాబు, వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారుల ఆహార అలవాట్లపై శ్రద్ధ చూపాలి

ప్రత్తిపాడు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల ఆహార అలవాట్లపై తల్లులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎస్ భారతి, మాధవి తెలిపారు. ప్రత్తిపాడు సెక్టార్ పరిధిలోని ప్రత్తిపాడు, గొట్టిపాడు అంగన్వాడీ కేంద్రాలలో తల్లులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం

● ఆలయాలకు పోటెత్తిన భక్తులు



దుగ్గిరాల: కేఆర్ కొండూరులో శ్రీబాలా త్రిపురసుందరీదేవిగా శ్రీమహంకాళీఅమ్మవారు



వట్టిచెరుకూరు: అనంతవరప్పాడులో శ్రీ బాలా త్రిపురసుందరిదేవిగా...

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు మంగళగిరిలో వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఆలయాలకు సోమవారం భక్తులు పోటెత్తారు. తొలిరోజు పలు ఆలయాల్లో అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పాతమంగళగిరి దుర్గానగర్‌లో ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారు, ఎర్రచెరువు వద్ద కొలువైన శ్రీకాళీమాత, స్టేషన్ రోడ్డులోని శ్రీ అఖిలాండేశ్వరీ అమ్మవారు, శివాలయంలో శ్రీగంగా భ్రమరాంబికా అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. కాళీమాత ఆలయంలో ఉదయం అవ్వారు హర్షవర్ధన్, దీప్తి దంపతులు కలశ స్థాపన నిర్వహించగా, సాయంత్రం మహిళలచే సామూహిక కుంకుమార్చనలు జరిపించారు. ఆయా ఆలయాల్లో ఇంటూరి దుర్గాప్రసాద్, తమ్మిశెట్టి వసంతకుమార్, కాలారి సుబ్బారావులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పాతమంగళగిరి జీఆర్ స్కూల్ వద్ద నవదుర్గా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. చిలుకూరి సూర్యకుమార్‌శాస్త్రి, పవన్‌కుమార్‌శాస్త్రి, తుమ్మా సత్యనారాయణ, వాకా హర్ష, ప్రేమ్, ముగ్గుళ్ల భానుప్రకాష్, బిట్రా సాయిబాస్కర్, కాట్రు బాజీసురేష్, పుట్టా రమేష్‌బాబు, వుడతా సుబ్బారావు, కె.అశోక్ పాల్గొన్నారు. స్థానిక శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో శ్రీరాజ్యలక్ష్మీ అమ్మవారు రాజ్యలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. మంగళగిరి పట్టణ పద్మశాలీయ బహూత్తమ సంఘం ప్రతినిధులు ప్రత్యేకపూజలు నిర్వహించారు.

● దుగ్గిరాల, సెప్టెంబరు 22: మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలతో తొలిరోజు అమ్మవారి ఆలయ ప్రాంగణాలు కళకళలాడాయి. కేఆర్‌కొండూరు శ్రీమహంకాళీఅమ్మవారు, దుగ్గిరాల శ్రీగంగాపార్వతీసమేత శ్రీనాగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు తొలిరోజు శ్రీబాలాత్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈమని, పేరుకలపూడి, శృంగారపురం, పెదకొండూరు, పెదపాలెం, చింతలపూడి, తుమ్మపూడి తదితర గ్రామాల్లోని శివాలయాల్లో బాలాత్రిపురసుందరిగా దర్శనమిచ్చారు. మహిళాభక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాలకు చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. కేఆర్‌కొండూరు శ్రీమహంకాళీ అమ్మవారి ఆలయంలో శ్రీచండీ హోమం కొనసాగించారు. ఈఓ కోగంటి సునీల్‌కుమార్, ఫౌండర్‌ట్రస్టీ దేవాభక్తుని రంగప్రసాద్ ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● తుళ్లూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రులలో భాగంగా అమ్మవారు తొలిరోజు బాలా త్రిపుర సుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తుళ్లూరులో గంగాపార్వతి సమేత రామలింగేశ్వరస్వామి, దుర్గా మల్లేశ్వరస్వామి, వీరభద్రస్వామి, వేణుగోపాలస్వామి ఆలయాల్లో, గీతామందిరం సెంటర్, తూర్పు వీధి బస్టాండ్ సెంటర్‌లో నెలకొల్పిన అమ్మవార్లకు, నేలపాడు, దొండపాడు, మందడం శివాలయం, పెదపరిమి, రాయపూడి, బోరుపాలెం, ఐనవోలు నెక్కల్లు, వడ్డమాను, అనంతవరం శివాలయాల్లోని అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవీగా దర్శనమిచ్చారు.

● వట్టిచెరుకూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి):



తుళ్లూరు: బాలా త్రిపురసుందరిదేవి అలంకారంలో తుళ్లూరు తూర్పు వీధి బస్టాండ్ సెంటర్‌లో నెలకొల్పిన అమ్మవారు

వట్టిచెరుకూరులోని గంగా భ్రమరాంబిక సమేత బ్రహ్మేశ్వర స్వామి ఆలయం, అనంతవరప్పాడులోని మల్లేశ్వరస్వామి ఆలయం, ముట్లూరు మల్లేశ్వరస్వామి ఆలయం, లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం, లేమల్లెపాడులోని పోలేరమ్మ దేవస్థానం, అనంతవరప్పాడులోని కన్యకాపమేశ్వరి ఆలయంలో దసరా శరన్నవరాత్రుల ప్రారంభం సందర్భంగా అమ్మవార్లకు బాలత్రిపుర సుందరిదేవి అలంకరణ చేశారు. ఉదయం నుంచి భక్తులు పూజా కార్యక్రమాలు, అభిషేకాల్లో పాల్గొన్నారు.



పాతమంగళగిరిలో అమ్మవారికి నవదుర్గా ఉత్సవ కమిటీ సభ్యుల పూజలు

● కాకుమాను, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దేవి శరన్నవరాత్రులలో భాగంగా తొలిరోజు బాల త్రిపురసుందరిదేవి అలంకారంలో శ్రీభువనేశ్వరిదేవి సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని కొండపాటూరు స్వయంభు శ్రీపోలేరమ్మతల్లి ఆలయం, అప్పాపురంలో శ్రీభువనేశ్వరిదేవి ఆలయం, కాకుమానులో గంగాపార్వతి సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయం, చెన్నకేశవస్వామి ఆలయం, కొల్లిమర్లలో రేణుకమ్మ తల్లి ఆలయం తదితర దేవాలయాలలో తొలిరోజు అమ్మవార్లు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లుచేశారు.



కాకుమాను: బాలా త్రిపుర సుందరిదేవిగా శ్రీభువనేశ్వరిదేవి..

● పెదనందిపాడు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని ఆయా దేవస్థానాల్లో సోమవారం అమ్మవార్లు బాలత్రిపురసుందరీదేవిగా దర్శనమిస్తున్నారు. తెల్లవారుజామునుండే భక్తులు దేవాలయాలకు పోటెత్తారు. దేవస్థానాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ నిర్వాహకులు భక్తులకు ఏర్పాట్లుచేశారు.



ఈవీఎంల గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న ఆర్డీవో కే శ్రీనివాసరావు

ఈవీఎంల గోడౌన్ తనిఖీ

ఫిరంగిపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేపూడి వ్యవసాయ మార్కెట్ నందు ఈవీఎంలు, వీవీ ప్యాక్ట్ గోడౌన్‌ను ఆర్డీవో కే శ్రీనివాసరావు సోమవారం తనిఖీ చేశారు. భద్రతా ప్రమాణాల్లో రాజీపడకుండా కట్టుదిట్టంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జే ప్రసాదరావు, ఆర్అండ్‌బీ ఏఈ బీ అరుణకుమారి, అగ్నిమాపక శాఖ అధికారి రాము, ఎం అరుణకుమార్, విద్యుత్ శాఖ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



లేమల్లెపాడులో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శివాని

మహిళలు శక్తివంతంగా ఎదగటానికి ఆరోగ్యవంతమైన జీవితం దోహదం

● డాక్టర్ శివానీ, డాక్టర్ సరిత

వట్టిచెరుకూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): స్త్రీ ద్వారానే కుటుంబాలు అభివృద్ధి చెందుతాయనే లక్ష్యంతో స్వస్థ్ నారి సశక్త్ పరివార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివానీ అన్నారు. స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని లేమల్లెపాడు గ్రామ సచివాలయంలో సోమవారం ఈ కార్యక్రమంలో డాక్టర్ శివాని, డాక్టర్ సరితలు మహిళలకు గుండె జబ్బులు, క్యాన్సర్, రక్త పరీక్షలు, షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి 175మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఏఎన్ఎం రజిని, ఆశావర్కర్ భానుప్రియ, ఎంఎల్‌హెచ్‌పీ రాధికలు సహకరించారు. తొలుత కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ పాతూరి శివపార్వతి, ఎంపీటీసీ నగరాజకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలతో తయారు చేసిన స్టాల్స్‌ను, వివిధ రకాల కూరగాయల స్టాల్ ఏర్పాటుచేశారు.

సోలార్ టెక్నీషియన్ కోర్సుతో ఉపాధి అవకాశాలు



శిక్షణ పొందుతున్న మహిళలతో ఎన్ఎస్ఐసీ జీఎం సురేష్‌బాబు

మంగళగిరి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సోలార్ పీవీ టెక్నీషియన్ కోర్సులో శిక్షణ పూర్తి చేసినవారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా వుంటాయని నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ ఏపీ, తెలంగాణ జనరల్ మేనేజర్ వి.సురేష్‌బాబు చెప్పారు. విజయవాడ వాసవ్య మహిళామండలి ఆధ్వర్యంలో ఆస్ట్రేలియన్ కాన్సులేట్ సౌజన్యంతో మంగళగిరి మండలం ఆత్మకూరు నిర్మల ఫార్మసీ కళాశాలలో 32 మంది మహిళలకు సోలార్ పీవీ టెక్నీషియన్‌కోర్సులో శిక్షణ ఇస్తున్నారు. శిబిరాన్ని సోమవారం సురేష్‌బాబు సందర్శించారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. అందుకు ఎన్ఎస్ఐసీ సూక్ష్మరుణాలను, సబ్సిడీలను అందజేస్తుందని తెలిపారు. ఎంఎస్ఎంఈ, సబ్సిడీలను పొందడానికి ఉద్యమ్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. అనంతరం శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు టూల్‌కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ట్రైనర్ రాబిన్‌జేమ్స్, వాసవ్య మహిళా మండలి ప్రెసిడెంట్ డాక్టర్ బొల్లినేని కీర్తి, వి.రవిబాబు, ముత్తు కుమారన్, సిస్టర్ నిర్మల జ్యోతి, డాక్టర్ పాములరెడ్డి, రత్నమంజుల తదితరులు పాల్గొన్నారు.

సంచార వాహనం ద్వారా పాస్‌పోర్ట్ సేవలు



సంచార వాహనం ద్వారా పాస్‌పోర్ట్ సేవలను అందిస్తున్న సిబ్బంది

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రజలకు పాస్‌పోర్ట్ సేవలను మరింత చేరువచేసేందుకు నూతనంగా ప్రవేశపెట్టిన సంచార వాహనం ద్వారా సోమవారం మంగళగిరిలో పాస్‌పోర్ట్ సేవలను అందించారు. విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం ఆధ్వర్యంలో మంగళగిరి వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో మొబైల్ పాస్‌పోర్ట్ సేవా వ్యాను ఏర్పాటుచేసి నూతన దరఖాస్తులను ప్రాసెస్ చేశారు. మంగళవారం కూడా ఈ సేవలు కొనసాగుతాయని కార్యాలయం కన్సల్టెంట్ రాధాకృష్ణ తెలిపారు. పాస్‌పోర్ట్ కోసం స్లాట్‌బుక్ చేసుకున్నవారు విజయవాడ రావలసిన అవసరం లేకుండానే మొబైల్ వ్యాను ద్వారా దరఖాస్తులను పరిశీలిస్తామన్నారు. ఇందుకోసం దరఖాస్తుదారులు స్లాట్‌బుక్ చేసుకునే సమయంలో ప్రాంతీయ కార్యాలయం విజయవాడ, మంగళగిరి మొబైల్ వ్యాన్ అనే ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. రెండు రోజుల్లో సుమారు 80మంది వరకు మొబైల్ సేవలను ఎంపిక చేసుకున్నారని, అవసరానికి అనుగుణంగా మొబైల్ వ్యాన్ సేవలను కొనసాగిస్తామని తెలిపారు.

ఒరిజినల్ సర్టిఫికెట్ల కోసం తల్లిదండ్రుల ఆందోళన



నిర్మల హైస్కూల్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

మంగళగిరి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు గ్రామంలోని నిర్మల సీబీఎస్ఈ పాఠశాల వద్ద పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం ఆందోళనకు దిగారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పరీక్షలు రాసి ఉత్తీర్ణులైన విద్యార్థుల సర్టిఫికెట్లు పాఠశాల కార్యాలయంలో మాయమైన ఘటనలో తమ పిల్లలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సర్టిఫికెట్ల మాయంపై పాఠశాల యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదుచేయగా, ఢిల్లీలోని సీబీఎస్ఈ బోర్డు ద్వారా ముందస్తుగా డూప్లికేట్ సర్టిఫికెట్లు జారీ అయ్యాయని, సదరు సర్టిఫికెట్ల పంపిణీకి సంబంధించిన సమాచారాన్ని స్కూల్ యాజమాన్యం తమకు తెలపడంలేదని తల్లిదండ్రులు తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికెట్లను గురించి ప్రశ్నిస్తే యాజమాన్యం తమతో దురుసుగా ప్రవర్తిస్తుందని వాపోయారు. సోమవారం తల్లిదండ్రులు పాఠశాల గేటు వద్ద బైఠాయించి నిరసన తెలుపుతుంటే మంగళగిరి రూరల్ పోలీసులు అక్కడికి చేరుకుని సర్దిచెప్పేయత్నం చేశారు. సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు. కేసును త్వరితగతిన విచారించి న్యాయంజరిగేలా చర్యలు తీసుకుంటామని హామీని ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

భవిష్యత్ సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహనకే హ్యాక్‌థాన్

● కళాశాల చైర్మన్ డాక్టర్ పెరుమాళ్ళు



కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలన చేస్తున్న డాక్టర్ పెరుమాళ్ళు, ఐడీయా ల్యాబ్ సీఈవో పంకజ్ దివాన్

వట్టిచెరుకూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో భవిష్యత్ సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహనకు అనుగుణంగా హ్యాక్‌థాన్ రూపకల్పన అభినందనీయమని మలినేని విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ పెరుమాళ్ళు అన్నారు. పుల్లడిగుంట సమీపంలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఏజెంటిక్ ఏ-1 కంప్యూటింగ్ హ్యాక్‌థాన్‌పై అవగాహన సదస్సును సోమవారం కళాశాల చైర్మన్ డాక్టర్ పెరుమాళ్ళు, ఐడీయా ల్యాబ్ సీఈవో పంకజ్ దివాన్‌తో కలసి ప్రారంభించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఐడీయా ల్యాబ్ సీఈవో పంకజ్ దివాన్‌లు మాట్లాడుతూ ఇలాంటి హ్యాక్‌థాన్‌లు విద్యార్థుల భవిష్యత్‌ను మరింత ఉజ్వలంగా ఉండేలా చేస్తాయన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ జే అప్పారావు మాట్లాడుతూ హ్యాక్‌థాన్‌లలో పాల్గొని సాంకేతికంగా ఎదగాలని పిలుపునిచ్చారు. డీఎస్ విభాగాధిపతి ఎస్ హరికృష్ణ హ్యాక్‌థాన్‌ల రూపకల్పన విద్యార్థుల భవిష్యత్‌కు ఎంతగానో దోహదపడతాయన్నారు.

ప్లాస్టిక్ రహిత గ్రామ నిర్మాణం వైపు అడుగులు వేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

తాడేపల్లి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రపంచానికి పెను సవాలుగా మారిన ప్లాస్టిక్‌ను పూర్తిగా నివారించి ప్రతి ఒక్కరూ బాధ్యతగా ప్లాస్టిక్ రహిత గ్రామ నిర్మాణం వైపు అడుగులువేయాలని కేఎల్‌యూ విద్యార్థి విభాగాధిపతి డాక్టర్ ప్రసాద్ సూచించారు. సోమవారం మండలంలోని వడ్డేశ్వరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే హానికర ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్, సీఎస్ఈ 2 విభాగం ఆధ్వర్యంలో వలంటీర్లు, విద్యార్థులు గ్రామ పంచాయితీ సిబ్బంది ప్లకార్డులు చేబూని ప్లాస్టిక్ వాడకండి.. పర్యావరణాన్ని కాపాడండంటూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కమ్యూనిటీహాల్ కూడలిలో మానవహారంగా ఏర్పడి స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞచేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ నాగమణి, సీఎస్ఈ 2 విభాగాధిపతి డాక్టర్ తిరుపతిరెడ్డి, ఫీల్డ్‌కోఆర్డినేటర్ పి సురేష్, ప్రోగ్రామ్‌కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళా సాధికారతే సమాజాభివృద్ధికి మూలాధారం

కేఎల్‌యూలోని ఉమన్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో మహిళల సాధికారత గురించి అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. సదస్సులో అంతర్జాతీయ రోటరీ, ఐఎంఎస్ గేట్స్ డైరెక్టర్ కృష్ణబాబు ముఖ్య అతిథిగా మాట్లాడుతూ మహిళలు విద్య, ఉపాధి, రాజకీయాలు, వ్యాపారం, విజ్ఞానశాస్త్రం వంటి అన్ని రంగాలలో ముందుకు సాగుతున్న తరుణంలో వారికి మరిన్ని అవకాశాలు కల్పించడం అవసరమన్నారు. కార్యక్రమంలో వీసీ డాక్టర్ సారధివర్మ, ప్రోవీసీలు డాక్టర్ ప్రసాద్, వెంకటరామ్, రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ ప్రసాద్, ఉమన్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ కె రూత్‌రమ్య, ఫుడ్ టెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం పద్మావతి, స్నేహిత్ఫి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు భారతీదేవి తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడిలో మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణానికి శ్రీకారం



చింతలపూడిలో మ్యాజిక్‌డ్రైన్ నిర్మాణానికి భూమిపూజలో పాల్గొన్న ఎంపీపీ జబీన్, సర్పంచ్ రామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షురాలు శ్రీఅనిత

దుగ్గిరాల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): చింతలపూడిలో మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, రాష్ట్రవిద్య, ఐటీ, మానవ వనరుల మంత్రి ఆలోచనల మేరకు వినూత్నంగా ఈ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టనున్నారు. పైలెట్ ప్రాజెక్టుగా చింతలపూడి గ్రామాన్ని ఎంచుకున్నారు. సైడ్‌వాల్‌కు బదులుగా నాపరాళ్ళతో తక్కువ ఖర్చుతో నిర్మాణం, మురుగు నీరు నిల్వలేకుండా ఉండటంతో దోమల బెడద కూడా ఉండదని అధికారులు చెబుతున్నారు. ఉపాధిహామీపథకం కింద, రూ.3.20లక్షలతో 350 మీటర్ల మేర నిర్మాణం చేపట్టనున్నారు. ఎంపీపీ షేక్ జబీన్, యార్డుచైర్‌పర్సన్ ఉన్నం ఝాన్సీరాణి టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, సర్పంచ్ తాడిబోయిన రామకృష్ణ, జనసేన అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, పట్టెల శ్రీనివాసరావు, కోలా రమణ, కమ్మెల సత్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీఓ జవహర్‌లాల్, కార్యదర్శి మణికంఠ, ఏపీఓ మధుబాల, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మస్టర్ పాయింట్ వద్ద పారిశుధ్య కార్మికుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్మికుల పనిదినాన్ని 13గంటలకు పెంచుతూ చంద్రబాబునాయుడు ప్రభుత్వం అసెంబ్లీలో పెట్టిన బిల్లును ఉపసంహరించుకోవాలని కార్మికవర్గాన్ని మరలా బానిసత్వంలోకి నెట్టే విధానాన్ని అనుమతించబోమని సీఐటియూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు అన్నారు. సోమవారం తాడేపల్లి, కృష్ణనగర్‌లోన మున్సిపల్ మస్టర్ పాయింట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించి ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, సమ్మె కాలం ఒప్పందాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బూరుగ వెంకటేశ్వర్లు, వనమా సతీష్, మేరి నాని, లక్ష్మి, కామాక్షి, రాంబాబు, బాలయ్య, సువార్త, అనూష, కొండయ్య విమల, సీమోను, బాబ్జి పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు భారీ ఉపశమనం

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపు ద్వారా దేశ ప్రజలకు భారీ ఉపశమనం కలుగుతుందని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు తుల్లిమిల్లి రామకృష్ణ యాదవ్ అన్నారు. జీఎస్టీ తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం మంగళగిరి గౌతమబుద్ధ రోడ్డుపై బాణాసంచా కాల్చి ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రామకృష్ణ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు ద్వారా దేశవ్యాప్తంగా ప్రజలకు రూ.2.5 లక్షల కోట్ల మేర ప్రయోజనం చేకూరుతుందని, ఏపీలోనే సుమారు రూ.8 వేల కోట్ల వరకు ఆదా అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మునగాల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి పంచుమర్తి ప్రసాద్, నేతలు మునగపాటి వెంకటేశ్వరరావు, కాండ్రు భానుకిషోర్, కొంగర జోగేంద్రప్రసాద్, దామర్ల దుర్గారావు, అందె శివశంకరరావు, కోవెలకారు రాకేష్, అడపా వెంకట్రావు పడమట రాధాకృష్ణ, తుమ్మా శ్యామ్, బొక్కా నరసింహారావు పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలి

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 8వ వార్డు అంజనేయకాలనీలో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటికీ తిరిగి సంతకాలను సేకరించారు. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేక మురుగు పారుదల నిలిచిపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయని నేతలు తెలిపారు. ఈ ప్రాంతంలో కుక్కల బెడద ఎక్కువగా వుందని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సచివాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు పిల్లలమర్రి బాలకృష్ణ, డి.రామారావు, టీ.హేమసుందరరావు, కే.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.4 లక్షల ఎల్‌వోసీ చెక్కు అందజేత



ఆస్పత్రిలో శివశంకర్ కుటుంబానికి చెక్కు అందజేస్తున్న నేత

మంగళగిరి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం నూతక్కి గ్రామానికి చెందిన తోట శివశంకర్ అనారోగ్యంతో బాధపడుతూ గుంటూరు కిమ్స్ చక్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శివశంకర్ వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.4 లక్షల ఎల్‌వోసీ మంజూరైంది. గ్రామ టీడీపీ నేతలు బాధితుడి కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు.

నేడు లోక్ కల్యాణ మేళ

తెనాలి అర్బన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం లోక్ కల్యాణ మేళ జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ చెప్పారు. ప్రధాన మంత్రి స్ట్రీట్ వెండర్స్ ఆత్మనిర్భర్ భారత్ నిధి పథకం కింద ఒక కుటుంబం, ఒక వ్యాపారవేత్త పథకానికి దరఖాస్తులు తీసుకోవడం, రుణ పంపిణీ సులభతరం చేయడం, బ్యాంకు తిరిగి పంపిన దరఖాస్తుల ప్రాసెసింగ్, పెండింగ్ దరఖాస్తుల పరిశీలన, డిజిటల్ ఆన్‌బోర్డింగ్, శిక్షణ వంటి అంశాలను చర్చిస్తామన్నారు. బ్యాంకు మేనేజర్లు, కార్మికశాఖ అధికారులు, పౌర సరఫరా శాఖ అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ, ఆహార భద్రత, అంగన్‌వాడీ అధికారులు హాజరు కావాలని కోరారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

రైల్వే బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టాలి:

● సీపీఎం నాయకుల వినతి

తెనాలి అర్బన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): చెంచుపేటలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి మరమ్మతులు చేపట్టాలని సీపీఎం నాయకులు సబ్ కలెక్టర్‌ను కోరారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం సబ్ కలెక్టర్ సంజన సింహాకు వినతిపత్రం అందజేశారు. కె.బాబుప్రసాద్ మాట్లాడుతూ తెనాలి నుంచి గుంటూరు మార్గంలో ఉన్న బ్రిడ్జి పలు చోట్ల దెబ్బతిందని, ఫుట్‌పాత్‌లు గుంతలతో ప్రమాదకరంగా మారిందని చెప్పారు. బ్రిడ్జికి ఇరువైపులా స్థలం వెంబడి ఫ్లెక్సీలు, కటౌట్‌లు ఏర్పాటు చేయడం వలన ప్రయాణికులపై పడే ప్రమాదం ఉందన్నారు. ప్రతి ఏటా బ్రిడ్జి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని కోరారు. షేక్ హుస్సేన్‌వలి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలాల్లో ఆక్రమణలు తొలగించాలి

శ్మశాన వాటికల స్థల ఆక్రమణలు తొలగించాల బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు కె.సునీల్ సందీప్ కోరారు. ఐతానగర్ క్రైస్తవ సమాధుల స్థలం అన్యాక్రాంతంపై సబ్ కలెక్టర్ సంజన సింహాకు వినతిపత్రం అందజేశారు. సమాధులలో ఇష్టానుసారం నిర్మాణం చేస్తున్నారని, సమాధులను భవంతుల్లా నిర్మించి ఇతరులకు స్థలం లేకుండా చేస్తున్నారని న్యాయవాదులు సురేష్, కోటేశ్వరరావు, ప్రకాష్‌బాబు ఫిర్యాదు చేశారు.

సబ్ కలెక్టర్ కార్యాలయానికి 15 దరఖాస్తులు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 15 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ 5, మున్సిపల్ 4, ట్రెజరీ 2, పంచాయతీరాజ్ 1, జిల్లా పరిషత్ 1, డీఆర్‌డీఏ 1, రైల్వే శాఖకు సంబంధించి ఒక దరఖాస్తు అందిందని అధికారులు తెలిపారు.

మున్సిపల్ కార్యాలయానికి ఆరు ...

తెనాలి అర్బన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు ఆరు దరఖాస్తులు అందాయి. 31వ వార్డులో కాల్వల నిర్మాణం, పైపులైన్లు, 32వ వార్డులో రహదారి, 30వ వార్డులో పైపులైన్లు, రోడ్లపై మట్టి తొలగించాలని, 1వ వార్డులో స్మశాన వాటికకు స్థలం కేటాయించాలని, 24వ వార్డులో ఆక్రమణలు తొలగించాలని కమిషనర్ శ్రీకాంత్‌కు దరఖాస్తులు అందించారు.

డ్రెయిన్ నిర్మాణం పూర్తి చేయాలి

తెనాలి అర్బన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): చెంచుపేటలో డ్రెయిన్ నిర్మాణంను పూర్తిచేయాలని సీపీఎం నాయకులు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందించారు. కాల్వల నిర్మాణం కోసం తీసిన మట్టిని రోడ్డుపై గుట్టగా పోశారని, 15రోజులు అవుతున్నా తొలగించకపోవడంతో ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని కె.బాబుప్రసాద్, హుస్సేన్‌వలి, అశోక్‌కుమార్ తెలిపారు.

ఫార్మసీ విద్యార్థులకు సీపీఆర్‌పై శిక్షణ

తెనాలి అర్బన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాలలో సోమవారం విద్యార్థులకు సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. డాక్టర్ బీవీ సత్యనారాయణ ఆకస్మికంగా గుండె ఆగిపోవడం, శ్వాస ఆగిపోవడం, అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను రక్షించడానికి ఉపయోగించే ప్రాథమిక పద్ధతులు వివరించారు. ఛాతీపై ఒత్తిడి, కృత్రిమ శ్వాస, అత్యవసర సేవల సమాచారం విద్యార్థులకు ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా నేర్పించారు. అనంతరం డాక్టర్ సత్యనారాయణను ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ, భార్గవి, జ్యోతిబసు, కల్యాణ చక్రవర్తి పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులపై ఫిర్యాదు

తెనాలి క్రైం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): భర్త, ఆడపడుచు, అత్త కలిసి తనను శారీరకంగా మానసికంగా వేధిస్తున్నారని ఐతానగర్‌కు చెందిన తిరుమల సంధ్యారాణి సోమవారం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందించింది. వివాహం జరిగి 15 సంవత్సరాలైందని, అధిక కట్నం కావాలంటూ వేధింపులకు గురి చేస్తున్నారని, పెద్దలు నచ్చచెప్పినా తీరు మార్చుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

25న సంప్రదాయ దుస్తుల పోటీలు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25, 26 తేదీల్లో తెలుగింటి సంప్రదాయ దుస్తుల పోటీలు నిర్వహిస్తామని శ్రీవెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ, శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో పోటీలు జరుగుతాయన్నారు. 10-18ఏళ్ల లోపు బాలికలు సంప్రదాయ దుస్తుల పోటీలు, 10-13 ఏళ్ల బాలికలు లంగా, జాకెట్ వస్త్రధారణ, 14-18 ఏళ్ల బాలికలు లంగా, జాకెట్, వోణి దుస్తుల పోటీలు జరుగుతాయన్నారు. విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు.

శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



తెనాలి శివాజీ చౌక్, మారీసుపేట శివాలయం, నందివెలుగులో వివిధ అలంకారాలు, దశావతార వెంకన్న సన్నిధిలో ఆదిలక్ష్మిగా మహాలక్ష్మి అమ్మవారు



బాల త్రిపుర సుందరి దేవిగా పొన్నూరులో పార్వతిదేవి, కాశీవిశాలాక్షమ్మ, కొల్లిపర శ్రీజనార్దనస్వామి ఆలయంలో అమ్మవార్లు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శ్రీదేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అన్ని ఆలయాలలో దుర్గమ్మ వారు బాలత్రిపురసుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. 11 రోజుల పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయాల్లో కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో విజయదశమి ఉత్సవాలను ఉభయ దాతలు ప్రారంభించారు. నగరేశ్వరస్వామి రుద్రాభిషేకం, మండపారాధన నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన, వనదుర్గ సహిత నవ చండీహోమం నిర్వహించారు. 296మంది దంపతులు నిత్య పూజలకు ఉదయ దాతలుగా విరాళాలు అందించారు. కూచిపూడి నృత్య కళానికేతన్ కళాకారులు కూచిపూడి జానపద నృత్యాలు ప్రదర్శించారు. నందులపేటలోని శ్రీషిరిడి సాయి అనుగ్రహ పీఠంలో అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు జరిపారు. కాత్యాయని దేవిగా అమ్మవారిని అలంకరించారు. సాలగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీవిద్యాపీఠంలో పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి ఉత్సవాలను ప్రారంభించారు. నందివెలుగు శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో పార్వతి అమ్మవారి కల్యాణం నిర్వహించారు. సీతా కళ్యాణం, హరికథా గానం, మహిళా బృందం చెక్క భజనలు, తిరుపతమ్మ తల్లి బుర్రకథ ప్రదర్శించారు. మారీసుపేట కోదండ రామాలయంలో ధర్మకర్త శివానందకుమార్, నారాయణస్వామి, ఆంజనేయప్రసాద్‌లు ఉత్సవాలను ప్రారంభించారు. మారీసుపేట శివాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలతో ఉత్సవాలను కమిటీ సభ్యులు ప్రారంభించారు. దేవీచౌక్‌లో రాజరాజశ్వరి అమ్మవారి రాజరాజేశ్వరి దేవిగా అలంకరించారు. గంగానమ్మపేట పాత శివాలయంలో, రామలింగేశ్వరపేట రామలింగేశ్వరాలయంలో అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించారు. దేవీచౌక్‌లో బాలపూజ, చక్రార్చన కార్యక్రమాలు నిర్వహించారు. దుర్గాభవానీ నాట్యమండలి కళాకారులు గయోపాఖ్యానం, రామాంజనేయ యుద్ధం నాటకాలు ప్రదర్శించారు. శివాజీచౌక్‌లో అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు జరిపారు. కమిటీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. శివాజీచౌక్, బోసురోడ్డు, దేవీచౌక్‌లో విద్యుత్ దీపాలతో అలంకరించారు.



శివాజీచౌక్‌లో దేవీ మండపం చుట్టూ విద్యుత్ దీపాలంకరణ

● కొల్లిపర: మండలంలోని వల్లభాపురం, మున్నంగి, తూములూరు, హనుమాన్‌పాలెం, దావులూరు, చక్రాయపాలెం, చివలూరు, అత్తోట గ్రామాల్లోని శివాలయాల్లో తొలిరోజు అమ్మవారిని శ్రీబాలత్రిపురసుందరీదేవి, శ్రీవనబాల, భవానీ దేవిగా, శ్రీవారాహిదేవిగా అలంకరణ చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమార్చనలతో పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సంఘ అధ్యక్షుడు అన్నవరపు రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారికి పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు పూజలు చేసిన దంపతులకు దుస్తులు పంపిణీ చేశారు. .

● తెనాలి క్రైం: దసరా ఉత్సవాల సందర్భంగా విద్యార్థుల్లో సంప్రదాయ కళలు గురించి వివరించడం కోసం స్థానిక చెంచుపేట రత్నశ్రీ స్కూల్ ప్రాంగణంలో విద్యార్థులకు సంప్రదాయ కోలాటం భజనలపై అవగాహన కల్పించారు. కోలాటంలో గల వివిధ రీతులను విద్యార్థులచే చేయించారు. దసరా పండుగ విశిష్టత గురించి విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసన్న, కరస్పాండెంట్ ఇర్ఫాద్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● తెనాలి అర్బన్: పట్టణంలోని దేవీ మండపాలు విద్యుత్ కాంతుల్లో మెరిసిపోతున్నాయి. బోసురోడ్డులోని శ్రీవాసవీ ఆలయం ఎదుట ప్రధాన రహదారిని, శివాజీ చౌక్ మండపం రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. డాంగేవారి వీధిలో 12వ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారి విగ్రహాన్ని నవదుర్గ అలంకరణతో ఏర్పాటు చేశారు. శివాజీచౌక్‌లో కూచిపూడి నృత్యం ప్రదర్శించిన బాలికలను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ అభినందించారు. దేవీచౌక్, శ్రీవాసవీ ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

● పొన్నూరు టౌన్: పట్టణ శివారులోని జీబీసీ రోడ్డులోని కనకదుర్గ భవాని అమ్మవారి ఆలయంలో అమ్మవారికి జలాభిసేకాలు, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని త్రిపుర సుందరీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో కొలువుదీరి ఉన్న సహస్ర లింగేశ్వర స్వామి ఆలయ ఉపాలయంలోని పార్వతీదేవి అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవిగా పూజలు అందుకుంది. శ్రీ సాక్షి భావనారాయణ స్వామి ఆలయంలోని కాశీ విశ్వేశ్వర స్వామి ఉపాలయంలోని కాశీ విశాలాక్షమ్మ బాలా త్రిపుర సుందరి దేవిగా పూజలు అందుకుంది. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలోనూ, శ్రీ తోటమ్మ తల్లి ఆలయం, నిడుబ్రోలు చౌడేశ్వర స్వామి ఆలయం చింతలపూడి భ్రమరాంబ దేవి ఆలయంలో నవరాత్రి పూజలను వైభవంగా ప్రారంభించారు.

● చేబ్రోలు: చేబ్రోలులోని నాగేశ్వరస్వామి, భీమేశ్వరస్వామి వారి దేవాలయాలలో దుర్గాదేవి బాలత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు.

● పెదకాకాని: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట ఉన్న దశావతార వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో మహాలక్ష్మి అమ్మవారిని ఆదిలక్ష్మిగా అలంకరించారు. ప్రతిరోజు ఉదయం 9 గంటలకు సాయంత్రం 6:00 గంటలకు సామూహిక కుంకుమార్చనలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణ భాస్కరరావు దంపతులు తెలిపారు.



తెనాలిలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

అంగలకుదురులో కలరా కేసు నమోదు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం అంగలకుదురులో కలరా కేసు నమోదయ్యింది. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న మహిళ గ్రామానికి వచ్చాక వాంతులు, విరేచనాలు అయ్యాయి. దీంతో ఆమె వైద్య చికిత్సకోసం తాడేపల్లి మణిపాల్ ఆసుపత్రికి వెళ్లారు. పరీక్షల్లో కలరా అని తేలినట్లు గుర్తించి వైద్య చికిత్స తీసుకుంటున్నారు. ఆమె పరిస్థితి మెరుగుగానే ఉందని పీహెచ్‌సీ వైద్యులు చెప్పారు. గ్రామంలో కలరా కేసు రావడంతో వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించగా ఎక్కడ ఎలాంటి డయేరియా కేసులు లేవని, కొన్ని చోట్ల జ్వరాలతో ఉన్నట్లు గుర్తించామని చికిత్స అందిస్తున్నామని పీహెచ్‌సీ వైద్యులు తెలిపారు. తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, ఎంపీడీవో అత్తోట దీప్తి, గ్రామాన్ని సందర్శించి పారిశుధ్యం మెరుగుపరచాలని ఆదేశించారు. గ్రామస్థులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, జ్వరాలు, డయేరియా ఉంటే మెరుగైన వైద్యం చేయించుకోవాలని కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.

కృష్ణానదిలో పెరిగిన వరద ఉధృతి

● 3లక్షల 87వేల 455 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల

● అప్రమత్తమైన అధికారులు



కొల్లిపర సమీపంలో లంక గ్రామాల నుంచి పడవలో వస్తున్న రైతులు

కొల్లిపర, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదికి వరదనీరు తగ్గినట్లే తగ్గి మరల పెరగటంతో మండల అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రకాశం బ్యారేజి నుంచి 3లక్షల 87వేల 455 క్యూసెక్కుల పైగా నీటిని కృష్ణానది దిగువకు విడుదల చేయడంతో సోమవారం ఇన్‌చార్జి తహసీల్దార్ గోపాలకృష్ణ వీఆర్వోలతో సమావేశాన్ని ఏర్పాటుచేసి కృష్ణానది రేవుల్లో వరద ఉధృతి పెరుగుతున్నందున ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. వరద ఉధృతి తగ్గే వరకు కృష్ణానది రేవుల్లో ప్రతిఒక్క వీఆర్వో డ్యూటీ చేయాలని హెచ్చరించారు. అనంతరం ఇన్‌చార్జి తహసీల్దార్ గోపాలకృష్ణ, ఎస్ఐ కోటేశ్వరరావు మండలంలోని వల్లభాపురం, మున్నంగి, పిడపర్తిపాలెం కొల్లిపర, బొమ్మువానిపాలెం, అన్నవరం గ్రామాల్లోని రేవులను సందర్శించి వరద ఉధృతిని పరిశీలించారు. కృష్ణానది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీచేశారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

● మాజీ ఎమ్మెల్యే శివకుమార్



మాజీ ఎమ్మెల్యే శివకుమార్‌ను సత్కరిస్తున్న పార్టీ అనుబంధ విభాగాల నేతలు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పిలుపునిచ్చారు. ప్రకాశం రోడ్డులోని వైసీపీ కార్యాలయంలో అనుబంధ విభాగాల నేతలు సోమవారం ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బాధ్యతలను చేపట్టిన వారంతా కార్యకర్తలు, అభిమానులను సమన్వయపరిచి పార్టీ పూర్వ వైభవానికి కృషి చేయాలని కోరారు. ఎరువుల కొరత కారణంగా రైతులు పడుతున్న ఇబ్బందులు, భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోలేని ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగట్టాలన్నారు. కొల్లిపర మండల యువజన విభాగం అధ్యక్షుడు యశ్వంత్ రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు తమ్మా సుజాత, బీసీ విభాగం అధ్యక్షుడు ఉయ్యూరు గోపి, మాజీ ఎమ్మెల్యేను సన్మానించారు. రామిరెడ్డి, వేణుగోపాలరెడ్డి, దుబాయ్‌బాబు, నాగమల్లేశ్వరరావు, అక్కిదాసు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి: మెడికల్ ఆఫీసర్ శ్రావణి



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రావణి

కొల్లిపర, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపర సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఈ నెల 24వ తేదీన వైద్యశిబిరంలో జరిగే రక్తదానానికి దాతలు సహకరించాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రావణి పిలుపునిచ్చారు. సోమవారం కొల్లిపర సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించిన అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు రక్తం ఎంతో అవసరమవుతోందన్నారు. దాతల నుంచి సేకరించిన రక్తం ఎంతో మంది ప్రాణాలను కాపాడుతుందన్నారు. రక్తదానం చేసేవారు తమ పేర్లను సామాజిక ఆరోగ్య కేంద్రంలో నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో వైద్యాధికారులు సుప్రియ, మణికంఠ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు ఆదేశించారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సీజనల్ వ్యాధులు అంటూ వ్యాధులపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం కొనసాగుతున్న నేపథ్యంలో భారీ వర్షాలు కురుస్తున్నాయన్నారు. వర్షానికి రహదారులు ఖాళీ స్థలాల్లో వ్యాధికారక దోమలు ప్రబలి ప్రజలు విషజ్వరాలు బారిన పడుతున్నారన్నారు. తాగునీటి సమస్యలతో గుంటూరు వంటి పట్టణాల్లో డయేరియా ప్రబలి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పొన్నూరు ప్రాంతంలో తాగునీటి సమస్యలు తలెత్తితే సమాచారం అందించాలని కోరారు. విష జ్వరాలు అంటువ్యాధులపై సమాచారం అందించాలని సూచించారు. అలాగే ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ జియావుల్ హక్ పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డీవీసీ ఇండోర్ స్టేడియంలో సౌకర్యాల కల్పనకు కృషి

● మున్సిపల్ కమిషనర్




వాకింగ్ ట్రాక్ చుట్టూ పెరిగిన గడ్డిని తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని డీవీసీ ఇండోర్ స్టేడియంలో ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు తెలిపారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం నిడుబ్రోలు జిల్లా పరిషత్ హైస్కూల్, డీవీసీ ఇండోర్ స్టేడియంను పురపాలక సంఘం అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల, స్టేడియంలో మొలిచిన పిచ్చి మొక్కలను పారిశుధ్య సిబ్బంది తొలగించారు. స్టేడియం పాఠశాల పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకొంటున్నట్లు చెప్పారు. వ్యాయామం కోసం వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారిశుధ్య సిబ్బంది నిరంతరం పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ గ్రంథాలయంలోకి వర్షపు నీరు

● తడిచిన పుస్తకాలు

● ఇబ్బంది పడుతున్న అధ్యాపకులు, విద్యార్థులు



ఏఎన్‌యూ గ్రంథాలయంలోకి చేరిన నీరు, మోటార్ సాయంతో నీళ్లు తోడుతున్న దృశ్యం

ఏఎన్‌యూ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) భారీ వర్షానికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని అంబేద్కర్ గ్రంథాలయం నీటి మడుగుగా మారింది. దీంతో చదువుకోవటానికి గ్రంథాలయానికి వస్తున్న అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విశ్వవిద్యాలయంలో అంబేద్కర్ గ్రంథాలయంను ఏర్పాటు చేశారు. మూడంతస్తులలో ఉన్న ఈ గ్రంథాలయంలో పీజీ, వృత్తివిద్య, పరిశోధన కోర్సులతో పాటు పోటీ పరీక్షలకు సంబంధించిన ఎన్నో పుస్తకాలు ఈ గ్రంథాలయంలో ఉన్నాయి. విశ్వవిద్యాలయంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో గత కొన్నాళ్లుగా కురుస్తున్న భారీ వర్షాలకు గ్రంథాలయం క్రింది భాగంలోకి నీరు చేరుతోంది. వర్షపు నీటితో గ్రంథాలయం క్రిందిభాగం నీటి మడుగుగా తయారవుతోంది. దీంతో పుస్తకాలు తడిసి ముద్దవుతున్నాయి. విశ్వవిద్యాలయం అధికారులు గ్రంథాలయంలోకి చేరిన వర్షపు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకుండా, తాత్కాలిక నివారణ చర్యలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారని విద్యార్థులు వాపోతున్నారు. దీంతో వర్షం పడిన ప్రతిసారీ సమస్య పునరావృతం అవుతోంది. విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు స్పందించి గ్రంథాలయంలోకి వర్షపు నీరు రాకుండా శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలని అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు కోరుతున్నారు.

ముస్లింల సంక్షేమానికి పాటుపడతాం

● జమాతే ఉలేమా అధ్యక్షుడు షేక్ రహమతుల్లా



జమాతే ఉలేమా అధ్యక్షుడు రహంతుల్లాను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముస్లింల సంక్షేమానికి పాటుపడతామని జమాతే ఉలేమా అధ్యక్షుడు షేక్ రహమతుల్లా అన్నారు. పట్టణంలో సోమవారం జమాతే ఉలేమా అధ్యక్షుడు రహంతుల్లాను టీడీపీ నాయకులు కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పొన్నూరు ప్రాంతంలో ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యలను మసీదుల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్ పట్టణ టీడీపీ అధ్యక్షుడు పఠాన్ అహ్మద్ ఖాన్ అంజుమన్ కమిటీ అధ్యక్షుడు మగ్బుల్‌బేగ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ బాజీ సాహెబ్, సైజుల్లా, రియాజ్, నూర్ఖాన్, రఫీ పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



చెంచుపేటలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అన్ని వస్తువులపై జీఎస్టీ తగ్గించడంతో ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగిందని జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు కె.వాసుదేవనాయుడు పేర్కొన్నారు. చెంచుపేటలో సోమవారం ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. శబరి వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. నిత్యావసర సరుకులు, ఎరువులు, మందులు, ఎలక్ట్రానిక్ పరికరాలు, వాహనాలపై గూడ్స్ సర్వీసు టాక్స్ తగ్గించడం హర్షణీయమన్నారు. బీమా ప్రీమియంలపై కూడా పూర్తి స్థాయిలో జీఎస్టీ తొలగించడం వలన పాలసీదారులకు మెరుగైన ప్రయోజనం లభించిందన్నారు. సందీప్‌రాజు, అనంతాచార్యులు, వీరయ్య, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి... ఇద్దరికి గాయాలు

కొల్లిపర, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని చివలూరులో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం కొల్లిపరకు చెందిన కంచర్ల విశాఖ (42), పేర్ల సుధీర్ కొల్లిపర నుంచి తెనాలికి బుల్లెట్‌పై వెళుతుండగా తెనాలి నుంచి వస్తున్న ఆటోను ఢీకొన్నాడు. దీంతో విశాఖ తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సుధీర్‌కు, ఆటోలో వస్తున్న కేసన కృపారావుకు గాయాలైనట్లు ఎస్ఐ తెలిపారు. విశాఖ మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

విద్యుత్ తీగలపై పడిన కొబ్బరి చెట్టు.. నిలిచిన విద్యుత్ సరఫరా

తెనాలి అర్బన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెనాలి నాజర్‌పేటలో సోమవారం రాత్రి కొబ్బరి చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడింది. దీంతో 11 కేవీ లైన్‌లో విద్యుత్ స్తంభం విరిగిపోయింది. గాలులు లేకపోయినా చెట్టు మధ్యలో పుచ్చురావటం వల్ల పడిపోయిందని గుర్తించారు. దీంతో ఆ ప్రాంతం విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.